ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
22 మే, 2011

పరిమళించిన పల్లె

హ్యాపీబర్త్‌డే

(2011 మే 22 నుంచి
2011 మే 28 వరకు)



బి.నవదీప్
1సం॥, మే-22
రామలింగస్వామి-స్వప్న
మునిగలవీడు-వరంగల్

చరిత్
మే
స్రవంతి-సురేష్
ఉయ్యూరు-విజయవాడ

బి.ఆనంద్
1సం॥, మే-26
కళ్యాణి-ఆంజనేయులు
మెంటేవారితోట-ప॥గో॥

ఎం.సాయిప్రశాంత్(లడ్డు)
మే-22
అనిత-గోపాల్
మెదక్

బి.కిరణ్మయి
4సం॥, మే-24
హేమలత-వెంకట్రావు
ఒంగోలు

ఎ.వందు(మానవ్)
3సం॥, మే-28
కావ్య-శ్రీధర్
కురవి-వరంగల్

శివానందు
మే
సునీత-రాము
కూసుమంచి-ఖమ్మం

బృంద
3సం॥, మే-27
షాలిని-నరసింహ
భీమవరం-ప॥గో॥

వై.విజయవరుణ్
3సం॥,మే-27
లావణ్య-గోపీకృష్ణ
శ్రీకాకుళం

బి.ప్రీతిసాయిశ్రీ
4సం॥,మే-26
వరలక్ష్మి-ప్రసాదరావు
చింతలవలస-విజయనగరం

నతిజీవన్‌సింగ్
9సం॥,మే-23
జగ్‌మగ్‌కౌర్-బహదూర్‌సింగ్
చిట్యాల-నల్లగొండ

అశ్వినిజయప్రకాష్
8సం॥,మే-22
సంధ్య-ఆంజనేయులు
రాజేంద్రనగర్-మ॥నగర్

మనలో మాట

లైసెన్స్‌డ్ టు కిల్

పెరిగిన ధరలు తగ్గించాలని, పునాదుల్లో ఆగిపోయిన ఇంటిని పూర్తి చేయాలని; రేషన్ షాపుల్లో పంచదార, కందిపప్పు సరఫరా చేయాలనీ జనం ధర్నాలు చేయడం మనం చూశాం, చూస్తున్నాం. ప్రజాక్షేమం పట్టని ప్రభుత్వాల ఏలుబడిలో ఇలాంటివి సహజం, సాధారణం. కానీ, తెలుగువారి సాంస్కృతిక నగరం రాజమండ్రిలో ఇప్పుడు ఈ తరహా డిమాండ్లు వినిపించటం లేదు. అలా అని సమస్యలన్నీ సమసిపోయాయి అనుకునేరు..! డ్రయినేజీ కంపు నుంచి ధరల పెంపు వరకూ అన్నీ షరా మామూలే! ముక్కు మూసుకొని, నోరు కట్టుకొని ఎలాగోలా నెట్టుకొస్తున్నారు జనం! వాటన్నిటినీ తోసిరాజని నగరవాసులను భయకంపితం చేస్తున్నాయ్ భైరవ రూపాలు..! అదేనండీ ... వీధికుక్కలు..!

నగర పాలక సంస్థ వారికి భూతదయ ఎక్కువై ఈ మధ్య కాలంలో కుక్కల నియంత్రణకు మంగళం పాడేశారు! ఫలితంగా వీధివీధినా కుక్కల సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. 'ఇక మా సత్తా చూడండి' అని జనం మీద పడ్డాయి. బ్యాచులు బ్యాచులుగా వీధుల్లో స్వైరవిహారం చేస్తూ, మనుషులను కరవడం మొదలెట్టాయి. 'రక్షించండి మహాప్రభో ..' అని సర్కారు ఆసుపత్రికి వెళితే- అక్కడ యాంటీ ర్యాబిస్ ఇంజక్షన్ల కొరత! ప్రయివేటుగా కొనుక్కునే స్తోమతు లేని పేదోళ్లు తాత్కాలిక వైద్యంతోనే సరిపెట్టుకుంటే- తరువాత ఏకంగా ప్రాణాలమీదికి వచ్చింది. కుక్కకాటుకు గురై ఇప్పటికి ఆరుగురు మృత్యువాత పడ్డారు.

అందువల్లే- కుక్కను చూస్తే హడలెత్తిపోతున్నారు రాజమండ్రి జనం. 'కుక్కలను నియంత్రించండి బాబూ..' అని మొరపెట్టుకుంటే- 'జీవహింస మహాపాపం' అని సుద్దులు చెబుతున్నారు నగర పాలక అధికారులు. 'మేం కూడా జీవులమేనండీ ...' అని మనుషులు మొత్తుకున్నా - వారి మనసులు చలించటం లేదు! పాలక పెద్దలు కూడా 'తప్ప మాది కాదు.. కరిచిన కుక్కది లేదా కరిపించుకున్న మనిషిది..' అన్న తరహాలో నివేదికలు సిద్ధం చేయిస్తున్నారు. ఇక, ఏ దిక్కూ లేని జనం కుక్కల భయంతో అల్లాడిపోతున్నారు. 'కుక్కల నుంచి రక్షించండి మహాప్రభో..' అని ఏకకంఠంతో ఏకైక నినాదం వినిపిస్తున్నారు. అయినా, సర్కారు స్పందిస్తున్న దృశ్యమేమీ కనపడడం లేదు. ఒక్కొక్క కేసు వెలుగులోకి వస్తుంటే చోద్యం చూస్తున్నారు తప్ప- ఇంకా ఎక్కడెక్కడ ఎంతెంతమంది కుక్కకాటు బాధితులు ఉన్నారు? వారికి సరైన వైద్యం అందిందా? లేదా? అన్న విచారణకు, కుక్కలను నియంత్రించే కార్యాచరణకూ పూనుకోవడం లేదు. ఏమో... ఏం ఆలోచిస్తున్నారో?! రాజమండ్రిలోలాగానే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ కుక్కలు విజృంభిస్తే- జనం సమస్యలన్నీ మరిచిపోయి, భౌభౌల భయంతోనే క్షణక్షణం చచ్చి బతుకుతారని తలపోస్తుందో... ఏమో! ఏలినవారి వెర్రి వెయ్యి విధాలుగా ఉంటుంది. వారు ఏమైనా యోచించవచ్చు. 'కుక్కకాటుకు చెప్ప దెబ్బ' అని అననే అన్నారు కదా పెద్దలు. మన జాగ్రత్తకోసం చెప్ప చేత పట్టుకొని సిద్ధంగా ఉండడం మంచిది.

★

ఈ సంచికలో....

టపా	...	2
ఈ పేజ్	...	4
తెలుగు సినిమా వాగనుశాసనుడు	...	5
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
రుచి	...	10
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
వికాసం	...	20
కొత్త పుస్తకాలు	...	21
మాటల కోట	...	24

ఇంకా...

సినిమా కబుర్లు ... 8

ఉరకలు వేసే ఉత్సాహం

తెల్సా ... 11

కాళ్లతో కళాఖండాలు

బాల నేస్తాలు ... 22

గరిటెముక్కు పక్షి



కోట్లు అవసరమా?

అట్టమీది కథ 'హై స్పీడ్ చైనా' చదివాం. అత్యంత వేగంగా నడిచే రైళ్ల చరిత్రతో సహా చాలా విలువైన విషయాలను అందించారు. కాశీవరుల రమానరసింహం 'స్మితాస్త్రం' కథ బాగుంది. 'ఆరోగ్యం'లో నవీన్ కుమార్ 'ది కాక్రేన్ లైబ్రరీ' విశిష్టత తేటతెల్లమైంది. 'బాలనేస్తాలు'లో చిన్నారి సచిన్ ఫోటో బావుంది. దేశాలు చుట్టివచ్చిన శునకం ఆస్కార్ ఫోజులు అలరించాయి. 'ఈ పేజీ'లోని చిన్నారి సైట్ల వివరాలు చదివిన తర్వాతే పిల్లల కోసం ఇన్ని సైట్లు ఉన్నాయని తెలిసింది. 'చూద్దామా' ద్వారా న్యూయార్క్ అందాలను పరోక్షంగా సందర్శించాం. 'సినిమా కబుర్లు' మంచి కాలక్షేపాన్నిస్తున్నాయి. చివరి పేజీలోని 'రైతు గుర్రం' కథ ముచ్చటగా ఉంది. 'రుచి'లో ఓట్స్‌తో చేసే వంటకం బాగుంది. ఆరోగ్యంగా ఉండాలంటే ఇవి తప్పకుండా తినాలి. 'మాటల కోట' సరదాగా, కాలక్షేపంగా ఉంటోంది. 'మనలో మాట' బాగుంది. నిజంగా ప్రజాసేవ చేసే ప్రజా ప్రతినిధులు ఇన్ని కోట్లు ఖర్చుచేయాలా?!

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

శాస్త్రీయ ఆలోచన ముఖ్యం

ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం చైనా. అయినప్పటికీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో బాగా అభివృద్ధి చెందింది. హైస్పీడ్ రైళ్లకు సంబంధించిన కవర్ స్టోరీ బాగుంది. నేటి పరిస్థితుల్లో ఇటువంటి రైళ్లు చాలా అవసరం. 'ఆ తొమ్మిది నెలలు - కల్పిత గాథలు' వ్యాసం బాగుంది. గర్భిణీలకు ఏవేవో అపోహలుంటాయి. విద్యావంతులు కూడా వీటిని నమ్ముతున్నారు. హాని కలుగజేసే మందుల వివరాలు కూడా ఈ వ్యాసానికి జత చేయడం బాగుంది. శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోడానికి ఈ వ్యాసం దోహదపడుతుంది. రచయితకు అభినందనలు.

టి. శ్రీరామ్మూర్తి, గాజువాక.

మనకి కూడా ఉంటే...

'చూద్దామా'లోని చిరుజల్లుల హరివిల్లు మా హృదయాల్లోనూ ఉల్లాసపు జల్లులు కురిపించింది. ఈ వారం 'అట్టమీది కథ'... చదివాక అత్యంత వేగంగా నడిచే రైళ్లు చైనాలోనే కాదు, మనదేశంలో కూడా ఉంటే బాగుండనిపించింది. అధిక జనాభా గల దేశంగా ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న మన దేశానికి ఇవి అవసరం కూడా. 'రుచి'లో మిరియాల రసం నోరూరించింది.

టి.వి.డి.ఎస్. సీతారామారావు,
విజయవాడ.

ఆహ్లాదం... ఆనందం...

చిరుజల్లుల హరివిల్లు బాగా ఆకర్షించింది. న్యూయార్క్‌లోని మెట్రో పొలిటన్ మ్యూజియం నుండి నయాగరా జలపాతం వరకు అన్ని దృశ్యాలూ కళ్లముందు కదిలినట్లు అనిపించింది. నయాగరా జలపాతం దగ్గర దారి పొడవునా పడే చిరుజల్లులు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తాయి.

నూతి నారాయణ రావు,
గద్దిఅన్నారం.

బాధ్యతల సమన్వయం

'స్మితాస్త్రం' కథలో బామ్మ, మనవరాలి బంధం బాగుంది. నేటి పిల్లలంతా ఇంతేనేమో! పిల్లలకేమో తల్లిదండ్రులతో గడపాలని ఆశ. తల్లిదండ్రులకేమో ఉద్యోగ బాధ్యత తప్పని సరి. అందుకే పెద్దలే ఈ రెండు బాధ్యతలను సమన్వయం

చేసుకోవాలి. అప్పుడు తమను అమ్మానాన్నలు పట్టించుకోవట్లేదనే అపోహ తొలగిపోతుంది. 'బాల నేస్తాలు'లో రంగులు మార్చే కాకి కథ బాగుంది. హైస్పీడ్ రైలు చైనా ప్రగతికి సోపానం.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

ఆరోగ్యంగా ఉండాలంటే...

పాపికొండల్లో ప్రయాణం, లాంచీలో విహార యాత్ర, ప్రకృతి రమణీయత... సత్యాజీ వర్ణించిన తీరు ఎంతో బాగుంది. ఎప్పుడెప్పుడు ఆ ప్రదేశాలను చూద్దామా అనిపించింది. 'సెల్‌తో ప్రపంచం మీ గుప్పిట్లో' వ్యాసం చాలా విషయాలను తెలియజేసింది. ఆరోగ్యంగా ఉండాలంటే నీరు తాగడం తప్పని సరి. రావెల సాంబశివరావు అమెరికా ప్రయాణపు విశేషాలు, అక్కడి దృశ్యాలు చక్కగా వర్ణించారు.

కె. హరినాథ్, నర్సరావుపేట.

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ **ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:**

CHENNAI:
0-9789099589

హాలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:**93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:**94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:**98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

లీకవుతున్న ఫేస్‌బుక్ వివరాలు

మీరు ఫేస్‌బుక్ వాడుతున్నారా..? మీ ఫేస్‌బుక్ అకౌంట్‌లో ముఖ్యమైన సమాచారం వుంచుతున్నారా? అయితే మీ సమాచారం భద్రంగా వుందా? అర్జంట్‌గా సరిచూసుకోండి. ఒకవేళ మీ ఫేస్‌బుక్ అకౌంట్‌లో ఏదైనా వ్యక్తిగత సమాచారం ఉంటే దాన్ని వెంటనే తొలగించి మరోచోట భద్రపరుచుకోవడం మంచిది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం కలిగిన సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఫేస్‌బుక్. ఆర్కుట్, హాయ్‌కుట్ వంటి ఎన్నో సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లను వెనక్కు నెట్టి ప్రస్తుతం రెండో ఇంటర్నెట్‌గా అవతరిస్తున్న ఫేస్‌బుక్ సెక్యూరిటీ రిస్క్‌లో పడింది.

వందల వేలకొద్దీ ఫేస్‌బుక్ వినియోగదార్ల ఖాతా వివరాలన్నీ థర్డ్ పార్టీకి ముఖ్యంగా వ్యాపార ప్రకటనల వారికి లీకవుతున్నట్లు 'డేటా సెక్యూరిటీ సొల్యూషన్ల సంస్థ సిమాంటెక్' వెల్లడించింది. కొన్నేళ్లుగా ఇలా జరుగుతోందని ఆ సంస్థ తన అధికారిక బ్లాగులో పేర్కొంది. ఫేస్‌బుక్ ఖాతాదారుల "యాక్సెస్ టోకెన్లు" లీక్ కావడంతో ప్రకటనదార్లు ఆయా ఖాతాల్లోని ప్రొఫైళ్లు, ఫొటోలు, చాటింగ్ వివరాలను వారు పొందడమే కాకుండా ఆయా ఖాతాల్లోకి సందేశాలను పంపడమూ చేస్తున్నారని వివరించింది. 'యాక్సెస్ టోకెన్లు' అంటే... అదనంగా ఇచ్చే తాళం చెవుల లాంటివి. వీటి ద్వారా ఖాతాదారు బదులు వేరెవరైనా ఖాతాను యాక్సెస్ చేసుకోవచ్చు. సిమాంటెక్ అంచనా ప్రకారం గత నెలలోనే 1,00,000 అప్లికేషన్లు లీకయ్యాయి. గత కొన్నేళ్లుగా చూస్తే లక్షల కొద్దీ టోకెన్లు వారిబారినపడి ఉండొచ్చని ఆ సంస్థ తన బ్లాగులో తెలిపింది. ఫేస్‌బుక్ సంస్థకు ఈ విషయాన్ని తెలిపామనీ, లీకేజీ గురించి ఆ సంస్థ సైతం అంగీకరించిందని.. అందుకు తగ్గ చర్యలు తీసుకోనున్నట్లు కూడా తమకు వివరించిందని సిమాంటిక్ తన బ్లాగ్‌లో పేర్కొంది.

అదేవిధంగా ఫేస్‌బుక్‌లో ప్రైవసీ సమస్యలు తలెత్తే ఆస్కారం ఉందని 'ఐటి భద్రత, నియంత్రణ సంస్థ సోఫోస్' పేర్కొంది. అంతే కాకుండా.. ఫేస్‌బుక్ అకౌంట్‌లలో నిల్వ చేసుకున్న చిరునామాలు, ఫోన్ నంబర్లను వెంటనే తొలగించుకోమని 'సోఫోస్' సీనియర్ టెక్నాలజీ కన్సల్టెంట్ గ్రాహమ్ క్లూలే చెపుతున్నారు. ఫేస్‌బుక్ యూజర్ల ఆఫ్-సైట్ కాంటాక్ట్ సమాచారాన్ని ప్రోగ్రామ్‌ల ద్వారా యాక్సెస్ చేయవచ్చు. వాస్తవానికి యూజర్ అనుమతి లేకుండా థర్డ్-పార్టీ ఫేస్‌బుక్ అప్లికేషన్లకు డేటా యాక్సెస్ చేసే అవకాశం లేదు. అయితే... ఇప్పటికే ఈ సైట్‌లో ఫేస్‌బుక్ పేరు, బ్రాండ్‌ను వాడుకొని హల్‌చల్ చేస్తున్న కొన్ని అప్లికేషన్ల ద్వారా డేటా అపహరణ గురయ్యే ఆస్కారం వుంది. ప్రపంచం నలుమూలల నుంచీ ప్రజలు, ప్రముఖులు ఈ సైట్ ద్వారా కనెక్ట్ చేయబడి ఉన్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని లబ్ధి పొందాలనే కొందరు ప్రబుద్ధులు యూజర్లకు స్పామ్ మెసేజ్‌లను పంపడం ద్వారా వారి అకౌంట్‌లోకి చొరబడి సమాచారాన్ని దోచేస్తున్నారు. కాబట్టి పరిచయం లేని వారికి వీలైనంత దూరంగా ఉండటంతో పాటు స్పామ్ మెసేజ్‌లను ఓపెన్ చేయకుండా అలానే డిలీట్ చేయడం ఉత్తమమని నిపుణులు సలహా ఇస్తున్నారు.

ఫేస్‌బుక్.... ఇదో సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్. మార్క్ జుకర్‌బర్గ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని తన సహ విద్యార్థులతో కలిసి ఈ ఫేస్‌బుక్‌ను రూపొందించాడు. ప్రపంచవ్యాప్తంగా మన్ననలు పొందుతున్న ఫేస్‌బుక్‌కు మొదట్లో పెద్దగా ఆదరణ లభించలేదు. 2006 సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఈ సైట్‌ను ప్రస్తుతం 400 మిలియన్లకు పైగా జనం దీన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. 13 సంవత్సరాలు పైబడినవాళ్ళెవరైనా తమ ఈ-మెయిల్ ఐడీ సాయంతో ఫేస్‌బుక్ యూజర్‌గా నమోదు చేసుకోవచ్చు. ఇది పూర్తిగా ఫ్రీ సైట్. ప్రకటనలవల్ల మాత్రమే ఈ సైట్ లబ్ధి పొందుతుంది. ఫేస్‌బుక్‌లో అనేక ఫీచర్లున్నాయి. ఫొటోతో ప్రొఫైల్ తయారు చేసుకోవచ్చు. తనకు సంబంధించిన సమాచారమంతా అందులో భద్రపరచు కోవచ్చు. లాగిన్ అయిన తర్వాత స్నేహితుల పేర్లు ఎంటర్ చేస్తే చాలు టచ్‌లోకొస్తారు. ప్రత్యక్షంగా చూసుకుంటూ మాట్లాడు కోవచ్చున్నమాట. రెజ్యూమ్స్, ఫైళ్ళు, లేటెస్ట్ ఫొటోలను అపరిమితంగా జత చేయొచ్చు. కుటుంబసభ్యుల ఆల్బమ్‌లు, బంధుమిత్రుల పుట్టినరోజులు, పెళ్ళిరోజు వివరాలు, తాజా వార్తల సమాహారం ఇంకా ఎలాంటి సమాచారమైనా సరే అప్‌లోడ్ చేసుకోవచ్చు. కాలేజీలు, ఆఫీసులు నిర్వహించే నెట్‌వర్క్‌లో చేరొచ్చు. ఎక్కడెక్కడివారితోనో పరిచయాలు, స్నేహాలు కల్పిస్తోంది ఫేస్‌బుక్. ఇంకా గమ్మత్తయిన విషయమేమిటంటే రెండు వేర్వేరు దేశాల్లోని ఇరువురు వ్యక్తులు చదరంగం ఆట ఆడొచ్చు. తాము కదిపే పావులను ఎప్పటికప్పుడు సేవ్ చేయవచ్చు. ఎప్పుడు కావాలంటే అప్పుడే ఆట ముగించవచ్చు లేదా కొంత సమయం తర్వాతనో కొద్ది రోజుల తర్వాతనో తిరిగి పావులను కదుపుతూ ఆట కొనసాగించవచ్చు.

ప్రస్తుతం ఫేస్‌బుక్ ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్, న్యూజిలాండ్, హాంగ్‌కాంగ్, వియత్నాం దేశాల్లో టాప్ సోషల్ నెట్‌వర్క్‌గా వుంది. ఫేస్‌బుక్ హెడ్ క్వార్టర్స్ క్యాలిఫోర్నియాలోని పాలో ఆల్టోలో స్టాన్‌ఫోర్డ్ రీసెర్చ్ పార్క్‌లో వుంది. ఈమధ్య మొబైల్ కంపెనీలన్నీ ఫేస్‌బుక్ ఆప్షన్ ఇస్తున్నాయి. ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడినుంచయినా లాగిన్ అవ్వొచ్చు. కుర్రకారు ఫేస్‌బుక్ తెరిచారంటే గంటలు క్షణాల్లా గడిచిపోతాయి. అంతా బాగానే వుంది. ఇంతటి జనాదరణ వున్న ఫేస్‌బుక్‌లో వ్యక్తిగత సమాచారానికి రక్షణ కరువైంది. దీనిపై సత్వరమే చర్యలు తీసుకుంటానని చెపుతోన్న ఫేస్‌బుక్... ఆ దిశగా అడుగులు వేసినప్పుడు మాత్రమే తన వినియోగదారుల మన్ననలు పొందగలుగుతుంది.

- కె.ఎక్స్.రాజు

జ్ఞాపకాలు

తెలుగు సినిమా వాగనుశాసనుడు



'వేణువై భువనానికి వచ్చిన వేటూరి సుందరరామమూర్తి గాలియై గగనానికి పోయి సంవత్సరమౌతోంది.

తెలుగు సినీ వినీలాకాశంలో ధృవతార వేటూరి సుందరరామమూర్తి. చక్కటి శబ్ద ప్రయోగం ఆయన ప్రత్యేకత. ఒక విధంగా చెప్పాలంటే తెలుగు సినిమా వాక్కుని శాసించారాయన. తెల్గుగు సినిమాకి కొత్త ఒరవడిని చూపిన మాటల మాంత్రికుడు పింగళి నాగేంద్రరావు గారి ప్రభావం వేటూరి మీద చాలా ఉంది. వేటూరి శబ్దరత్నాకరుడు. మాటలతో ఆయన బహుముచ్చటగా ఆడుకున్నారు.

ఆయన చేసిన ప్రయోగాలు ఒకటా రెండా... వ్యాసం మొదటి వాక్యమే ఆయన ప్రయోగానికి మచ్చుతునక. "సప్తపది" చిత్రానికి ఆయన రచించిన 'ప్రేపల్లియ ఎద ఝల్లున పొంగిన మురళి' పాటలో 'ఆబాల గోపాలమాబాల గోపాలుని అచ్చెరువున అచ్చెరువున విచ్చిన కన్నుల చూడ తాండవమాడిన సరళి' అని శబ్దాలంకారాలతో ఆనంద తాండవం చేశారు. తదుపరి వచ్చిన 'శ్రీమద్విరాటపర్వం' చిత్రంలో బృహన్నల నృత్య పరీక్షకు రచించిన పాట 'జీవితమే కృష్ణ సంగీతము' పాటలో 'ఆబాల గోపాలుని ఆ బాల గోపాల'మని కాళీయ మర్దన ఘట్టాన్ని వర్ణించడానికి మరల ఉపయోగించారు వేటూరి. సిరిసిరిమువ్వ సినిమాలో 'ఝుమ్మంది నాదం... సై అంది పాదం, అందానికి అందం ఈ పుత్తడి బొమ్మ' పాటలు సుమధురాలు కాగా 'రా దిగిరా' పాటలో నటరాజ శతసహస్ర రవితేజ నటగాయక వైతాళిక మునిజన భోజ'. ఆ పద ప్రయోగం అంతా శివుని జటాజూటం నుండి దూకే గంగా ప్రవాహమే... ఇక 'శంకరాభరణం'లో పాటల గురించి ఎంత చెప్పినా తక్కువే. 'ఓం కార నాదాను సంధానమౌ గానమే శంకరాభరణమూ, శంకర గళనిగళమూ, శ్రీహరి పద కమలమూ, రాగరత్న మాలికా తరళము శంకరాభరణమూ, రాగం తానం పల్లవి, దొరకునా ఇటువంటి సేవా' పల్లవితో 'ఉచ్ఛ్వాస నిశ్వాసములు వాయులీనాలు స్పందించు నవనాడులే వీణా నాదాలు...' అన్నీ వెలకట్టలేని ఆణిముత్యాలే.. 'భక్త కన్నప్ప' చిత్రానికి కిరాతార్జుననీయము', 'యమగోల' సినిమాకు 'ఆడవే అందాల సురభామిని' ఆయన అంతులేని శబ్దకోశాగారానికి నిలువెత్తు తార్కాణాలు.. 'సామజ వరగమన' పల్లవితో మొదలైన పాటను ప్రణయగీతంగా మార్చారు.

'కృషి వుంటే మనుషులు రుషులవుతారు.. మహా పురుషులవుతారు... తరతరాలకు తరగని వెలుగవుతారు... ఇలవేలుపులవుతారు' ఇంతకంటే స్ఫూర్తిదాయకమైన పాట ఇంకేముంటుంది?!

శబ్దాన్ని అర్థవంతంగా, సందర్భానుగుణంగా ప్రయోగించడం వేటూరి ప్రత్యేకత. ఉదాహరణకు 'ప్రతిఘటన' సినిమాలో 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకంలో' పాటలో ఆయన ప్రయోగించిన 'ప్రతి భారతి సతిమానం చంద్రమతి మాంగల్యం' అనన్య సామాన్యం. 'సాగర సంగమం' సినిమాకి ఆయన రచించిన 'ఓం నమశ్శివాయ, వాగార్థా, వేదం అణువణువున నాదం, తకిట తదిమి తకిట తదిమి తందాన... అన్నీ ప్రత్యేకతలే. 'సప్తపది' సినిమాకి 'అఖిలాండేశ్వరి, నెమలికి నేర్పిన నడకలివి' పాటలతో పాటు వర్ణాశ్రమధర్మంపై ధ్వజమెత్తిన 'ఏ కులమూ నీదంటే, గోపయ్య నల్లన' పాటలు ఇప్పటికీ అందరి నోళ్లలో నానుతున్నవే. రామోజీరావు నిర్మించిన 'శ్రీవారికి ప్రేమలేఖ' సినిమాలో 'మనసా తుళ్లి పడకే, తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' పాటలు శ్రావ్యంగా ఉంటాయి. 'రఘువంశ సుధాంబు చంద్రశి' పాటకు పేరడీ 'పరహింసా' ప్రయోగం ఆయనకే చెల్లు. 'చూడాలని ఉంది' సినిమాకు రఘువంశ సుధాంబు' పాట వరసలో 'యమహో యమహా కలకత్తా పురి' పాట బాగా హిట్ అయింది. ఆయన 'ఇంద్ర' సినిమా కోసం వారణాశి మీద రచించిన పాట బహుళ ప్రజాదరణ పొందింది.. వేటూరి కలానికి రెండు వైపులా పదునే... ఒక వైపు పదును చూశాము. రెండో వైపు 'చిలక కొట్టుడు కొడితే, ఓలమ్మి తిక్కరేగిందా, ఆరేసుకోబోయి పారేసుకున్నాను, గుడివాడ వెళ్లాను, అ అంటే అమలాపురం, నీవళ్లు బంగారంగానూ' అనీ అనగలరు. ఆయన ఏమన్నా జన సందోహానికి సమ్మతమే. ఆయన పాటలన్నీ అత్యంత ప్రజాదరణ పొందినవే. ఆయన కలం నుండి జాలువారిన అసంఖ్యాకమైన పాటలలో ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే. వెలలేని రత్నాలు ఎన్నో... ఎన్నెన్నో... కె. విశ్వనాథ్ 'ఓ సీతకథ'తో ప్రారంభమైన సినీ ప్రస్థానం ఆయన మహా ప్రస్థానంతో కూడా ఆగలేదు. ఆయన పాట రచించిన బద్రీనాథ్ సినిమా ఆడియో ఇటీవలే విడుదలైంది. చిత్రం త్వరలో విడుదల కానుంది.



సామజవరగమన...

- కె.వి.ఎస్.కె.ఎస్.పాపారావు

హస్త లాఘవం

దూరంగా వీణ విషాదం ఆలపిస్తోంది
వయోలిన్ శృంగారం పలుకుతోంది
మృదంగం శివతాండవం ఆడుతోంది
సుక్షేత్రంలో హరితంలా
నవరసాలు విరాజిల్లుతున్నాయి
పండిన చీకట్ని వెలుగు
కోత కోసి నూర్పిడి చేస్తోంది
బుడిబుడి నడకల సూర్యుడు
తూర్పుతల్లి వొడిలో
ఆడుతూ పాడుతూ పరుగెడుతూ
కేరింతలు కొడుతున్నాడు!
అంబర రంగస్థలంలో గాలిపటం
ఒకసారి మయూరమై నాట్యం చేస్తూ
ఒకసారి నాగరాజై పడగతిప్పుతూ
ఎల్లల్ని చెరిపేస్తూ హద్దుల్ని దాటుతూ
రంగుల్లేని రోదసిలో హరివిల్లులు గీసి
మెరిపిస్తూ మైమరపిస్తోంది!
అహింస ప్రచార రాయబారి



శ్వేత కపోతం
నీలాకాశంలో విహరిస్తూ
జలపాతమై జారుతూ
శాంతి వచనం ప్రవచిస్తోంది!

హింసాయుధానికి
అహింసాయుధం నేలకూలింది
ఆకసాన రక్తతర్పణ చేసి
పావురాయి యశశ్శేషమైంది!
మంచిని పెంచి ప్రేమించమంటూ
సమూహం పాడుకుంటూ
ఇలపై ప్రచారం చేసుకుంటూ
దేశభక్తిని చాటుతూ సాగుతోంది
అవినీతిని అకృత్యాల్ని అరికట్టమంటూ
కదం తొక్కుతూ పదం పాడుతూ
జనావళి పయనిస్తోంది!
కోపించిన తుపాకులు
కుండపోత గుళ్ల వర్షం
కురుస్తున్నాయి
భూమండలాన్ని ఒకడు
హస్తలాఘవం చేస్తున్నాడు!

- అడిగోపుల వెంకటరత్నమ్

కవిత్వమ్

హార్మోనియం

నీటిమీద అలలు అక్షరాలు
చెట్టుమీద ఆకులు వాక్యాలు
కొమ్మమీద పూలు శబ్దాలు
చూరుకు జారే చినుకులు పాటలు
నన్ను జైల్లో పెట్టి
కవిత్వాన్ని ఎట్లా ఆపుతావు?

సముద్రం హార్మోనియం
ఎడారి ఒక పియానో
అడవులు సితార్లు
మైదానాలు మారుమోగే
షెహనాయిలు
నన్ను బంధించి పాటనెట్లా ఆపుతావు?
గాలి నా మాట వింటుంది

వెలుతురుకు నా భాష తెలుస్తుంది
చీకట్లో నా కళ్లు
సీతాకోక చిలుకలు
బేడీలున్న చేతులు
దాచిన తాళపత్రాలు
నన్ను హింసిస్తావు
చరిత్రనెట్లా చెరిపేస్తావు?

కవిత్వం, అర్ధరాత్రి
నిశ్శబ్దంగా కురిసే వర్షం
తుపాకులతో వెంబడిస్తే
తడి దొరికేది కాదు!

కాగితాలు చించుతావు
పుస్తకాలు దులుపుతావు
జేబుల్లో చేతులు పెడ్తావు
బ్యాగులు లాగుతావు
మనసులోని
తుఫాను నీకు దొరకదు!

కవిత్వం బతికించే ఊపిరి
ఊగేటి ఉరికంబం
ఉప్పొంగే జీవితం
ఎన్ని ఊళ్లని వెదుకుతావు?
ఎన్నాళ్లు తిరుగుతావు?

కవిత్వం కలలో ఉంటుంది
కత్తి ఒరలో ఉంటుంది
అమ్మల పాదిలో ఉంటుంది
ఆత్మవిశ్వాసంలో ఉంటుంది
నమ్మకంలో ఉంటుంది
చెదరని ఆశయంలో ఉంటుంది
నిద్రపోని ఆయుధంలో ఉంటుంది
ఎక్కడని కనిపెడ్తావు?
ఎట్లా అరికడ్తావు?

అమరం కవిత్వం
జననం కవిత్వం
కదనం కవిత్వం
కన్నీళ్లు కవిత్వం
నీకు తెలియదు
జైలు గోడలూ కవిత్వం
కవిత్వాన్ని ఆపుతావా!?

-ఆశారాజు

సంభవామి యుగేయుగే!

ఆనాడు...
ఆ 'హాఫ్ నేకెడ్ ఫకీర్' పీల గొంతులో
ఏదో మహత్తు...
అందుకే మరి, జాగృతమైంది జాతి యావత్తూ
కండ లేకుంటే నేమి?
సత్యం, అహింసలే ఆయుధాలుగా
కొండ చిలువలాంటి జాతిని
జూలు విదిల్చిన సింహాలా మార్చి
కొండలాంటి సామ్రాజ్యాన్ని
తోకముడుచుకునేలా చేశాడు.

మళ్లీ ఈనాటికి...
అవినీతిపై అలిగిన ఈ 'యోగి'
నిరసనతో మేలుకొంది

నిద్రాణమైయున్న జాతి సమస్తమూ
కొత్త జెండా పట్టి, ప్రజాసేవ పేరిట
చట్టసభల్లో దూరి, తమ్ముకు చస్తూ
జీతాలు పెంచమని ఆందోళన చేపట్టలేదు

శతకోటి పిడికిళ్లకు వేదికై నిల్చి
శతఘ్నులు పేల్చాడు
స్తబ్ద సమాజపు తిత్తుల్లోకి
చైతన్యాన్ని పూరించాడు
దేశం చేతిలో కొవ్వొత్తిగా వెలిగి
కుర్చీలెక్కిన అవినీతి మత్తేభాల పాలిట
అంకుశమైనాడు 'అన్నా'

ఇప్పుడు చైతన్యం పూనిన సామాన్యుడి చేతులు
అర్థించడానికి దోసిలి పట్టవు
ప్రశ్నించడానికి పైకి లేస్తాయి
సాధించడానికి పిడికిళ్లు బిగిస్తాయి

- మల్లారెడ్డి మురళీమోహన్

నవ్వుల్ - పువ్వుల్

మాయం

కస్టమర్ : ఏంటి మీ హోటల్లో ప్లాస్టిక్ స్పూన్లు, పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు పెట్టారు?

సప్లయర్ : మెటల్‌వి పెడుతుంటే మాయం అవుతున్నాయి సర్.

జె. సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

ప్లేన్

రాజేంద్ర: పైలెట్లు ఏం తింటారా?

వీరేంద్ర: అదికూడా తెలీదా! ప్లేన్ బిస్కెట్లు.

నిషేధం

(ఇద్దరు స్నేహితులు పబ్బుకెళ్లారు. డ్రింక్ ఆర్డర్ చేశారు. బ్యాగ్‌లోంచి తాము తెచ్చుకున్న సాండ్‌విచ్చులు తీసుకుని తినసాగారు)

సర్వర్: సార్! ఇక్కడ మీవి మీరు తినకూడదు సార్.

వ్యక్తులు: (ఒక్కసారిగా) అవునా! అయితే ఒకరిదొకరం మార్చుకుని తింటాం. అప్పుడు అభ్యంతరం లేదుగా.

కనిపించట్లా

రోగి: డాక్టర్! నేను మాట్లాడేటప్పుడు అవతలి మనిషి కనిపించట్లేదు. ఎందువల్ల?

డాక్టర్: అలా ఎప్పుడెప్పుడు జరుగుతోంది?

రోగి: నేను ఫోనులో మాట్లాడేటప్పుడు.

ఎంతసేపు?

వ్యక్తి: (ఫోన్లో) మేడమ్! విమానంలో ఢిల్లీ నుంచి ఆస్ట్రేలియా ప్రయాణం చేయడానికి ఎంత సమయం పడుతుంది?

ఎయిర్ లైన్స్ ఉద్యోగిని: ఒక్క నిముషం....!

వ్యక్తి: ఓస్... అంతేనా! థ్యాంక్యూ.

ఎయిర్ లైన్స్ ఉద్యోగిని: ఏంటిది? పూర్తిగా సమాధానం వినకుండానే పెట్టేశాడు?!

వణుకు

టీచర్: వణికించే దేశం ఏది?

విద్యార్థి: చిలీ

మంచి డ్రైవర్లు

రంజిత్: క్షురకులు డ్రైవింగ్ బాగా చేస్తారెందుకని?

సంపత్: ఎందుకంటే వాళ్లకు షార్టుకట్లు బాగా తెలుసు కనక.

కాళ్లు చూసి...



టీచర్: కాళ్లతో చూసే పక్షి పేరు చెప్పు?

విద్యార్థి: నాకు తెలీదు సార్.

టీచర్: అయితే నువ్వు తప్పినట్టే. నీ పేరేంటి?

విద్యార్థి: నా కాళ్లు చూసి నా పేరు రాసుకోండి సార్.

టెలిగ్రాం



(యజమాని అర్జంటుగా ఊరెళుతూ పనివాడిని టెలిగ్రాం ద్వారా పుట్టింట్లో వున్న భార్యకు విషయం చెప్పమంటాడు)

మహిళ: ఒరే...మీ బావగారు ఇవాళ పోయారట్రా. ఇక నా గతేం కాను? టెలిగ్రాం చూడు.

తమ్ముడు: 'సాబ్...ఆజ్...మర్ గయా' నా? అక్కా... కంగారు పడకు. బావ ఆజ్మీర్ వెళ్లుంటాడు. ఆ పనివాడు అలా టెలిగ్రాం ఇచ్చి వుంటాడు.

అభినందనలు

కొంటె ప్రశ్న: ఎవరైనా తప్పు చేసినప్పుడు అభినందించే సందర్భం ఏది?

కొంటెగి జవాబు: పెళ్లి చేసుకున్నప్పుడు.

ఎం. మాధవి, గుంటూరు.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

ఉరకలు వేసే ఉత్సాహం

అతని వయస్సు 25 ఏళ్ళు. ఆ వయస్సులో ఉండే అందరు కుర్రాళ్ళలాగే సరదాగా, సంతోషంగా, అల్లరి చేస్తూ కనిపిస్తారు. అయితే, అనుకున్న పని చేయడానికి వచ్చేసరికి మాత్రం అతనిలో అల్లరి స్థానంలో ఆత్మవిశ్వాసం, అకుంఠిత దీక్ష కనిపిస్తాయి. చిత్ర నిర్మాణం నుంచి చిత్రరంగ విశేషాలు పంచుకొనే పత్రికా స్థాపన దాకా అన్నింటిలో చిన్న వయస్సులోనే పెద్ద అనుభవం సంపాదించిన ఆ నవ యువకుడి పేరు - **అల్లు శిరీష్**. ప్రతి అంశాన్నీ లోతుగా అధ్యయనం చేయడం అతనిలోని ప్రత్యేకత. అందుకే, ప్రతిష్ఠాత్మక 'ఫిక్కీ' సంస్థ కొద్ది నెలల క్రితం భారతీయ వినోద రంగంపై జరిపిన రెండు రోజుల సదస్సులో కూడా కమలహాసన్ లాంటి అనుభవజ్ఞులతో కలసి వేదిక పంచుకున్నారు. సినీ వ్యాపార ధోరణులపై అభిప్రాయాలు వ్యక్తం చేయడమే కాక, అందరితో చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. ఫలితంగా, ఎంచుకున్న రంగంలో ఎదురుచూస్తున్న గమ్యం చేరడానికి సొంతంగా దారులు చేసుకుంటూ ముందుకు సాగే నవతరానికి అల్లు శిరీష్ ఇప్పుడు ప్రతీక అయ్యారు. నలుగురికీ స్ఫూర్తిగా నిలిచారు.



భారత బాక్సాఫీస్ వసూళ్ళలో చరిత్ర సృష్టించిన 'గజిని' హిందీ రూపానికీ, తెలుగు చిత్రం 'మగధీర'కూ చిత్ర నిర్మాణంలో శిరీష్ క్రియాశీలకంగా పనిచేశారు. అలాగే, 'జల్సా' చిత్ర నిర్మాణానంతర కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఇలా తమ కుటుంబానికి చెందిన చిత్ర నిర్మాణ సంస్థ 'గీతా ఆర్ట్స్'లో గడచిన రెండు మూడేళ్ళుగా చిత్ర నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. శిరీష్‌కు ఘన వారసత్వమే ఉంది. ప్రముఖ నటుడు 'పద్మశ్రీ' అల్లు రామలింగయ్య అతని తాతగారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌కు మూడో కుమారుడైన శిరీష్‌కు సహజంగానే చిన్నతనం నుంచి సినిమా రంగం మీద ఆసక్తి కలిగింది. ఆ వయసు నుంచి అతనికి జర్నలిజమ్ మీద కూడా ఆసక్తి ఉండడం విశేషం. "అప్పట్లో 'చందమామ', 'చంపక్', 'ఇండియా టుడే' లాంటి మ్యాగజైన్లలో వచ్చిన కథలు, వ్యాసాల్లో నాకు నచ్చిన వాటన్నిటినీ కత్తిరించి, కాగితాల మీద అంటించుకొని, నాకు నచ్చిన నా పత్రిక లాగా కుట్టుకొనేవాణ్ణి" అని శిరీష్ ఆ సంగతులు చెప్పారు.

పత్రికా రంగంలో అనుభవం

చిన్నతనంలో మద్రాసులో పెరిగి, అక్కడే చదువుకొన్న శిరీష్ ఆ తరువాత చిత్రసీమ హైదరాబాద్‌కు తరలినప్పుడు తమ కుటుంబంతో పాటు రాజధానికి వచ్చేశారు. అందరిలానే తననూ ఇంజనీరింగ్ చదివించాలని ఇంట్లోవాళ్ళు ఇంటర్‌లో సైన్సు (ఎం.పి.సి.) గ్రూపులో చేర్పిస్తే, అది కాదని ఆర్ట్స్ (సి.ఇ.సి.) గ్రూపులోకి మారి, ఇంటర్ పూర్తి చేశారు. ఆ పైన బొంబాయిలోని నేషనల్ కాలేజ్‌లో బ్యాచ్‌లర్స్ ఇన్ మాస్ మీడియా (బి.ఎం.ఎం) చదివారు. బొంబాయిలో ఉండగా, పాఠకులకు ఉచితంగా ఇచ్చే 'ఆన్ ట్రాక్ సబ్ అర్బ్' అనే వారపత్రికలో ఉప సంపాదకుడిగా పనిచేసిన అనుభవం శిరీష్‌కు ఉంది. "నెలకు రూ. 3500 జీతంతో అలా అయిదు నెలలు పనిచేశా. ఆ జీతం ఒక్క రోజు నా స్టార్ హోటల్ భోజనానికి కూడా సరిపోదు. కానీ, అదో తమాషా. అంతే! అక్కడ పని చేయడం వల్ల నేను పత్రికా రచన, నిర్వహణలోని లోతుపాతులు తెలుసుకోగలిగాను. పత్రికల్లో సంపాదక వర్గమే కాక, అడ్వర్టయిజింగ్, మార్కెటింగ్, పంపిణీ – ఇలా పలు విభాగాల సమిష్టి కృషి అవసరమని గ్రహించాను" అని శిరీష్ ఆ అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ అనుభవంతో ఈ యువకుడు ఇప్పుడు 'సౌత్ స్కోప్' అనే సరికొత్త ఆంగ్ల సినీ పత్రికను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. 2009 సెప్టెంబర్‌లో మొదలుపెట్టి, ఆరు నెలల కాలంలోనే దక్షిణ భారత సినీ పరిశ్రమ, పాఠకుల దృష్టిని అమితంగా ఆకర్షించారు.

పత్రికా నిర్వహణకు ప్రేరణ

అసలు ఇంతకీ ఈ రకమైన సినిమా పత్రిక పెట్టాలనే ఆలోచన ఆయనకు ఎందుకు వచ్చినట్లు? "గతంలో తెలుగు, తమిళం, కన్నడం, మలయాళ చిత్రాల నిర్మాణమంతా మద్రాసులోనే జరిగేది. దాంతో, ఏ భాషా రంగంలో ఏం జరుగుతోందో, ఏవేం కొత్త మార్పులు సాంకేతికంగా, కథా సంవిధాన పరంగా వచ్చాయో అందరికీ తెలిసేవి. కానీ, ఇప్పుడు ఆ యా భాషా చిత్ర పరిశ్రమలు ఆ యా రాష్ట్రాలకు తరలిపోయాయి. దాంతో, సినీ రంగంలో ఏ భాషలో, ఏం జరుగుతోందో అందరికీ తెలియడం లేదు. మునుపు ఉన్న ఐక్యత, సమగ్రత ఇప్పుడు లేవు. ఈ పరిస్థితుల్లో వివిధ ప్రాంతీయ భాషా ప్రేక్షకుల మధ్య వారధిలా ఉపయోగపడాలన్న ఉద్దేశంతో 'సౌత్ స్కోప్'కు శ్రీకారం చుట్టాను" అని అల్లు శిరీష్ సుదీర్ఘ వివరణే ఇచ్చారు.

ఆ పత్రిక స్థాపన కోసం ఆయన చాలా శ్రమే తీసుకున్నారు. "అతి పెద్దదైన దక్షిణ భారత సినీ పరిశ్రమకు ప్రాధాన్యమిస్తూ, ఆంగ్లంలో సరైన పత్రిక ఏదీ లేదు. ఉన్నవన్నీ హిందీ చిత్ర పరిశ్రమకు ప్రాధాన్యమిచ్చేవే! మన సినిమాకు పెద్ద పీట వేస్తూ, అలాంటి పత్రిక ఆంగ్లంలో తీసుకురావాలని చిన్న రిసెర్చ్ తరహాలో సర్వే చేసి, ఆరు నెలల కృషితో చివరకు 2009 సెప్టెంబర్‌లో 'సౌత్ స్కోప్' మాసపత్రికను ప్రారంభించాం" అని శిరీష్ తెలిపారు. ఈ పత్రిక నిర్వహణలో

ఆయన అందరూ నడిచే దారిన కాకుండా, కొత్త పంథా అనుసరించారు. ఫ్యాషన్, సినిమా రూపకల్పనలోని విశేషాలు, నిర్మాతలు - సాంకేతిక నిపుణులు పడే శ్రమ లాంటి వాటికి తమ పత్రికలో ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వసాగారు. చిత్ర నిర్మాణంలోని తెర వెనుక సంగతులతో పాఠకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే, చిత్ర ప్రచారం కోసం దర్శక - నిర్మాతల బృందం అందరికీ ఇచ్చే ఫోటోలతో సంతృప్తి పడకుండా, తారలతో ప్రత్యేకంగా 'ఫోటో షూట్‌లు' నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ఫీచర్లు ప్రచురిస్తున్నారు. "ఉన్నత ప్రమాణాలతో పత్రికను అందంగా, ఆకర్షణీయంగా తీసుకురావడం కోసం మేము ఎంతో సమయం, శ్రమ, డబ్బు వెచ్చిస్తున్నాం" అని శిరీష్ గర్వంగా చెప్పారు.

ఆ శ్రమ త్వరితగతిన ఫలిస్తోంది. "కేవలం 15 వేల ప్రతులతో ఆరంభమైన ఆ పత్రిక అచిరకాలంలోనే మూడింతలు పెరిగి, 42 వేల ప్రతుల పై చిలుకు స్థాయికి చేరింది." పెద్దన్నయ్య అల్లు వెంకటేశ్, రెండో అన్నయ్య హీరో అల్లు అర్జున్‌లతో పాటు ఇంట్లో వారందరి సహాయ సహకారాలూ ఎప్పటికప్పుడు తన ఉన్నతికి తోడ్పడుతున్నాయని శిరీష్ చెప్పారు. చిరంజీవితో సహా ఆయన కుటుంబం మొత్తం తన ప్రయత్నాలను ప్రోత్సహిస్తూ, ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలిస్తున్నట్లు తెలిపారు. సినిమా వ్యాపారం, మార్కెటింగ్ విషయాల గురించి ఎప్పటికప్పుడు పత్రికలో వివరంగా తెలియజేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. "సినిమా రంగ వ్యాపారం, ఆర్థిక అంశాల మీద శ్రద్ధ పెట్టడానికి కారణం ఉంది. డిస్ట్రిబ్యూటర్లకు తప్ప సినిమాల అసలు సిసలు వసూళ్ళ గురించి ఎవరికీ తెలియదు. తెలిసిన వాళ్ళు కూడా పెదవి విప్పరు. దాంతో, వసూళ్ళలో పరిశ్రమకున్న అసలు సిసలు సత్తా ఏమిటో పదుగురికీ స్పష్టం కావడం లేదు. ఓ ఇంగ్లీషు సామెతలో చెప్పినట్లుగా, 'ఆకలిగొన్న వాడికి అన్నం పెట్టేసి, ఆ ఒక్క పూటా కడుపు నింపడం కాకుండా, అన్నం సంపాదించుకొనే మార్గం నేర్పాలి' అనుకుంటున్నా. చిత్ర రంగంలోని లోతుపాతులు సామాన్యులకు పరిచయం చేయాలనుకుంటున్నా" అని చెప్పారు. పరిశ్రమలోని వ్యాపార అంశాలు, మర్మాల పట్ల చాలామందిలో ఉన్న ఆసక్తిని ఆయన గుర్తించారు. అందుకే, "సినీ రంగంలో చిత్ర నిర్మాణం ఎంత క్లిష్టమో, నిర్మాతలు ఎంత కష్టపడుతున్నారో అందరికీ పత్రికా వ్యాసాల ద్వారా వివరించి చెబుతున్నా" అన్నారు.

చిరకాల స్వప్నం

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో పాఠకుల్లో పేరు సంపాదించిన 'సౌత్ స్కోప్'ను మరిన్ని మార్కెటింగ్ ప్రోత్సాహక కార్యకలాపాలతో ఇతర రాష్ట్రాల్లో కూడా జనంలోకి చొచ్చుకొనిపోయేలా చేయాలన్నది శిరీష్ ఆలోచన. 2009 చివరలో తమ పత్రిక తరఫున ఓ ప్రత్యేక ఈవెంట్ నిర్వహించి, ఆ ఏటి సినిమాల్లోని తారల పాత్రధారణకు 'స్టైల్' అవార్డులను అందజేశారు. ('జల్సా'లో పవన్ కల్యాణ్, 'కంత్రి'లో ఎన్టీఆర్ జూనియర్ తదితరుల పోటీ మధ్య చివరకు 'కంత్రి'లో ఎన్టీఆర్ జూనియర్‌ను 'స్టైల్' అవార్డు వరించింది). క్రమం తప్పకుండా జరిపే ఇలాంటి ప్రత్యేక ఈవెంట్ల ద్వారా పత్రికనే కాదు, తెలుగు సినిమాను సైతం నూతన తీరాలకు తీసుకువెళ్ళాలనీ, కొత్త పుంతలు తొక్కి, పూర్తి స్థాయిలో సినిమా మార్కెటింగ్‌ను జరపాలనీ ఈ యువకుడి దీర్ఘకాలిక స్వప్నం.

"మన భారతీయ సినిమా మార్కెట్ రూ. 2500 కోట్లు అయితే, ఒక్క తెలుగు సినిమా మార్కెట్ - రూ. 700 కోట్లు" అంటారు - అల్లు శిరీష్. కానీ, "తెలుగు సినిమా సత్తాకు తగ్గట్లుగా మనం దాన్ని మార్కెటింగ్ చేయడం లేదు. ఆ లోపాన్ని సరిదిద్దుకోవాలి. ఒకప్పుడు కళాత్మకంగానూ, కమర్షియల్‌గానూ అగ్రగామిగా నిలిచిన తెలుగు పరిశ్రమను మళ్ళీ ఆ బాటలో పెట్టి, మరింత ముందుకు తీసుకువెళ్ళడం చాలా ముఖ్యం" అని ఈ యువ వ్యాపారశీలి ఆవేశంగా అంటూనే, ఆలోచనలు రేకెత్తించారు. వసూళ్ళలో సైతం తెలుగు సినిమా సంపూర్ణ సామర్థ్యాన్ని వెలికి తీయడం కోసం శిరీష్ బుర్రలో ఎన్నో వ్యూహాలున్నాయి.

భవిష్యత్ ప్రణాళికలు

తండ్రి (అల్లు అరవింద్) చాటు బిడ్డగా పెరిగినా, త్వరలోనే స్వతంత్ర వ్యక్తిత్వాన్ని చాటుకున్న శిరీష్ తన తండ్రి బాటలోనే నిర్మాతగా కూడా ఎదగాలని భావిస్తున్నారు. తెలుగు సూపర్‌హిట్ 'మగధీర'ను ప్రస్తుతం 'మావీరన్'గా తమిళంలోకి తెస్తున్నారు. ఇటీవలే ఆ చిత్రం ఆడియో విడుదలను వినూత్నంగా, ఘనంగా చెన్నైలో చేసుకొచ్చారు. "మా 'గీతా ఆర్ట్స్' పతాకంపై చాలా ఏళ్ళ క్రితం 1991లో రజనీకాంత్‌తో 'మాప్పిళ్ళై' చిత్రం నిర్మించాం. ఆ తరువాత హీరో విజయ్‌తో కలసి, 1997లో 'నినైత్తేన్ వందాయ్' చిత్రానికి సహ-నిర్మాతగా వ్యవహరించాం. చాలా కాలం తరువాత 'మావీరన్'తో మళ్ళీ తమిళ చిత్ర సీమలోకి ప్రవేశిస్తున్నాం" అని శిరీష్ వివరించారు. ఈ మే నెలాఖరులో కానీ, జూన్ మొదట్లో కానీ ఆ చిత్రాన్ని తమిళనాట విడుదల చేయనున్నారు. చిన్నతనమంతా చెన్నైలోనే గడిపిన ఈ ఉత్సాహవంతుడు, "ప్రతి రెండు నెలలకూ ఒకసారైనా చెన్నైకి వెళ్ళి, తాజా చిత్రాలు చూసి వస్తుంటా" అన్నారు. త్వరలోనే నిర్మాతగా కూడా ఎదగాలనుకుంటున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలయ్యేలా ఓ భారీ బడ్జెట్ ద్విభాషా చిత్రాన్ని వచ్చే ఏడాదిలో నిర్మించనున్నారు. "మధ్యలో ఓ చిన్న బడ్జెట్ నిర్మాణం ఆలోచన కూడా ఉంది" అని అతను వివరించారు.

తండ్రి నుంచి పెట్టుబడి తీసుకొని, పత్రికా నిర్వహణలోకి దిగి, "ఇప్పటి దాకా రూ. 3 కోట్లు పెట్టుబడి పెట్టిన" శిరీష్ మరికొద్ది కాలంలోనే పత్రికను లాభాల బాటలో నడిపించగలనని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, తెలుగు సినిమాకు మళ్ళీ ఒకప్పటి స్వర్ణయుగపు వెలుగులు రప్పించాలని ఈ అల్లు కుటుంబ వ్యాపార వారసుడు ఆశిస్తున్నారు. "తెలుగు సినీ పరిశ్రమను మరింతగా విస్తరింపజేసి, భారీ స్థాయికి తీసుకువెళ్ళాలన్నది నా ఆశయం. ఫార్ములా ఆధారంగా నడిచే వాణిజ్య విజయాలతో పాటు, చిరకాలం నిలిచిపోయే చిత్రాలతో స్వర్ణయుగాన్ని మళ్ళీ తీసుకురావాలి. అందుకు అనుగుణంగానే త్వరలోనే చిత్ర నిర్మాణానికి సంబంధించిన మరికొన్ని వ్యాపారాలు ప్రారంభిస్తాను. ప్రస్తుతానికి అవి సస్పెన్స్" అని అల్లు శిరీష్ చిరునవ్వు చిందించారు.

ఆ ప్రయత్నాలన్నీ త్వరలో తెరపై చూడాల్సిందే! "నాకు కలలు కూడా సినిమాల గురించే వస్తుంటాయి" అని ఫెళ్ళున నవ్వేసిన ఈ నవ యువకుడికి సినిమా పరిశ్రమ గురించి చాలా కలలే ఉన్నాయి. పట్టుమని పాతికేళ్ళు (2011 మే నెల 30వ తేదీతో పాతికేళ్ళు నిండుతాయి) లేకుండానే చిత్ర రంగంపై ఇంతటి ఆసక్తి, సరికొత్త ఆలోచనలు ఉన్న ఈ యువకుడు ఆశయసాధనలో మరిన్ని అడుగులు ముందుకు వేయడం ఖాయమనిపిస్తోంది. ఆల్ ది బెస్ట్ టు యంగ్ తరంగ్ అల్లు శిరీష్!

- రెంటాల జూనియర్



పచ్చి పులుసు

కావలసిన పదార్థాలు

చింతపండు - గ్రాములు
నీళ్లు - 4 కప్పులు
నువ్వుల పొడి - 50 గ్రాములు
ఉల్లిపాయ ముక్కలు - 1 కప్పు
కారం - అర టీ స్పూన్
ఉప్పు - తగినంత
కరివేపాకు - 4 రెమ్మలు
కొత్తిమీర - కొద్దిగా
ఎండుమిర్చి - 4
తాలింపు గిజంలు - 1 టీ స్పూన్
నూనె - 2 టీ స్పూన్లు

తయారు చేసే విధానం

చింతపండుని నానబెట్టి రసం తియ్యాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, కారం, కొత్తిమీర, నువ్వుల పొడి, ఉప్పు వెయ్యాలి. బాండీలో నూనె వేసి కాగాక ఎండుమిర్చి, కరివేపాకు, తాలింపు గింజలతో తిరగమోత వేయాలి. దీన్ని చింతపండు రసంలో కలపాలి. అంతే పచ్చిపులుసు రెడీ. తీపి ఇష్టమైనవాళ్లు కొంచెం చిన్న బెల్లం ముక్క కూడా వేసుకోవచ్చు.

మామిడికాయ చారు



కావలసిన పదార్థాలు

మామిడికాయ - 1
నీళ్లు - 4 కప్పులు
ఉప్పు - తగినంత
కరివేపాకు - 4 రెమ్మలు
పచ్చిమిర్చి - 4
ఉల్లిపాయ - 1
నూనె - 2 టీ స్పూన్లు
కొత్తిమీర - కొద్దిగా
తాలింపు గింజలు- 1 టేబుల్ స్పూన్

తయారు చేసే విధానం

మామిడి కాయని నిప్పుల మీద లేదా స్టౌవ్ సెగ మీద బాగా కాల్చి చల్లారనివ్వాలి. తర్వాత తొక్క తీసి గుజ్జుని గిన్నెలో వేసుకోవాలి. ఈ గుజ్జులో నీళ్లు, ఉప్పు కలిపి పెట్టుకోవాలి. గిన్నెలో నూనె వేసి కాగాక తాలింపు వేసుకుని పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, కరివేపాకు వెయ్యాలి.అందులో ఉప్పు కలుపుకున్న మామిడికాయ గుజ్జు మిశ్రమాన్ని వేయాలి. పైన కొత్తిమీర తరుగు చల్లుకుంటే బావుంటుంది.

దోసకాయ పచ్చి పచ్చడి

కావలసిన పదార్థాలు

దోసకాయ చిన్న ముక్కలు - 1 కప్పు
పచ్చిమిర్చి ముద్ద -అర టీ స్పూన్
ఉప్పు - తగినంత, కొత్తిమీర - కొద్దిగా
నూనె - 2 టీ స్పూన్లు
తాలింపు గింజలు - 2 టీ స్పూన్లు

తయారు చేసే విధానం

దోసకాయను చిన్న చిన్న ముక్కలు కోసుకోవాలి. ఆ ముక్కల్లో నూరిన ఉప్పు, పచ్చిమిర్చి ముద్ద కలిపి పక్కన పెట్టుకోవాలి. గిన్నెలో తాలింపు వేసుకుని అందులో దోసముక్కల మిశ్రమం కలపాలి. అంతే నోరూరించే దోసకాయ పచ్చడి రెడీ.



నిమ్మ చారు

కావలసిన పదార్థాలు

కంది పప్పు లేదా పెసరపప్పు - 100 గ్రా
నిమ్మరసం - 2 టీ స్పూన్లు
ఉప్పు - తగినంత
కరివేపాకు - 4 రెమ్మలు
కొత్తిమీర - కొద్దిగా
పచ్చిమిర్చి - 3
నెయ్యి - అర టేబుల్ స్పూన్
తాలింపు గింజలు - 1 టేబుల్ స్పూన్

తయారు చేసే విధానం

ముందు పప్పు వండుకోవాలి. దాని పైన నీరుంటే అదంతా వంపి పక్కన పెట్టుకోవాలి. గిన్నెలో నెయ్యి వేసి కాగనివ్వాలి. తర్వాత తాలింపు గింజలు వేసి వేగాక ఇంగువ, పచ్చిమిర్చి ముక్కలు వెయ్యాలి. స్టౌవ్ మీద నుండి దించిన తర్వాత ఉప్పు, నిమ్మరసం వేసి మూతపెట్టి కొంచెంసేపు అలాగే ఉంచాలి.





కాళ్లతో కళాఖండాలు

అన్ని అవయవాలు సక్రమంగా వున్న వారు ... ఓ తెగ కష్టపడిపోతున్నట్టు... ఇదైపోతుంటారు అప్పుడప్పుడు. మరి ఇక్కడ కాళ్లతో...నోటితో బొమ్మలు వేసుకుంటూ సంసార నావ నడుపుకొస్తున్న వ్యక్తిని చూస్తే ఏమనిపిస్తుంది? మనవీ ఒక కష్టాలేనా! అని. నిజమే మరి! ఇతని పేరు హువాంగ్ గోపు. నాలుగు పదులు నిండాయి. చేతులు లేకపోయినా కాళ్లతోనే అద్భుతమైన బొమ్మలు వేస్తూ...అమ్ముతూ కనిపిస్తాడు. తనకు నాలుగేళ్ల వయసులో జరిగిన దుర్ఘటనలో రెండు చేతులూ పోయాయి. అలాగని డీలా పడిపోలేదు. పన్నెండేళ్లప్పుడు బ్రష్ తీసుకున్నాడు కాలితో. ఇంక అంతే! కాళ్లతో...నోటితో బ్రష్షు పట్టుకొని అందమైన ప్రకృతిని తన బొమ్మల్లో బంధించసాగాడు. అంతేకాదండోయ్! వాటిని అమ్ముతాడు కూడా. ఆ డబ్బుతోనే తన రోగిష్టి తండ్రికి వైద్యం చేయిస్తాడు. అతనికి భార్య ఎంతగానో సాయం చేస్తుంది. ఏ ప్రాంతాన్నైతే బొమ్మగా వేయాలనుకుంటాడో! అక్కడకు కావాల్సిన సామగ్రిని అంటే... చార్టులు, కాన్వాస్, రంగులు, బల్లలు అందించే బాధ్యత ఆమెది. చైనాలో జరిగిన 2010 వరల్డ్ ఎక్స్‌పోలో తన బొమ్మలను ప్రదర్శించాడు హువాంగ్. చేతులు లేకుండానే అందరి మన్ననలు అందుకుంటున్న హువాంగ్ యువతకు ఏం చెప్తాడంటే...."జీవితం ఒక తలుపు మూసేసిందనుకోండి. దానికే చింతిస్తూ కూర్చోకూడదు. మరో మార్గం వెతుక్కోవాలి. ఎందుకంటే అది మరో మార్గం తెరిచి వుంటుంది! నిజానికి మన జీవితంలో ఆటంకాలంటూ ఏమీ వుండవు. మనం వాటిని దాటుకు వెళ్లగలిగితే!" అంటాడు ఎంతో స్థిరంగా.

శునకంతో పెళ్లి

వెర్రి వెయ్యి రకాలని పెద్దలు ఊరకనే అనలా! ఇదిగో ఇలాంటి వారిని చూసే అనుంటారు. వయసులో వున్న ఏ పిల్లాడైనా చక్కని చుక్కలాంటి అమ్మాయిని చూసి పెళ్లాడతాడు. చూడచక్కని తమ జంటను చూచి దీవించమని పెళ్లికి తెల్సిన వారిని, బంధువులను, మిత్రులను పిల్చుకుంటారు. ఇలాంటి పెళ్లిళ్లను మనం ఇంతవరకు చూశాం. కానీ ఇదో విచిత్రమైన పెళ్లి! చూడండి ఇతగాడి పేరు జోసఫ్. ఆస్ట్రేలియా వాసి. వయసు ఇరవై. ఈయన గారికి ఇంత సువిశాల ప్రపంచంలో పిల్లే దొరకనట్టు పెంపుడు కుక్కను పెళ్లాడేశాడు. లాబ్రాడర్ జాతికి చెందిన ఆ కుక్క పేరు హనీ. దాని వయసు ఐదు. ఎంచక్కా బంధుమిత్రులను పిల్చేసి పెళ్లాడేసి ఇదిగో ఇలా ఫొటోలకు ఫోజులిచ్చాడు జో. ఇలాంటి తిక్క పనులు చేసేవారు కూడా ఈ భూమి మీద వున్నారని సరిపెట్టుకోవాలా? లేక బాధపడాలా?

తెలుసా!

బామ్మగారి కొమ్ము బాధ

ఈ చైనా బామ్మగారి పేరు యాన్. జన్‌గాంగ్ గ్రామవాసి. పాపం పుట్టు చెవుడు, మూగ. అసలుకైతే ఆవిడ పేరేంటో ఎవరికీ తెలీదు. అందరూ ఆవిడను యాన్ (చైనా భాషలో మూగమ్మాయి అని అర్థం) అని పిలుస్తుంటారు. ఆవిడకు 2008లో నుదుటి మీద చిన్న కొమ్ము లాంటిది వచ్చింది. అప్పటి నుంచి అది మెల్లగా పెరగసాగింది. చివరికి అది మెలికలు తిరిగి కంటికి గుచ్చుకునే దశకు చేరుకుంది. దాంతో పేద బామ్మగారి పిల్లలు ఆమెను స్థానిక వైద్యుల దగ్గరకు తీసుకెళ్లారు. వారు ఆపరేషన్ చేసి ఆ కొమ్ము తీసేశారు. అయితే కొమ్ము మరలా పుట్టుకొచ్చింది. అదేంటో గానీ... రెండోసారి అది మరింత వేగంగా పెరగసాగింది. దాంతో పిల్లలు ఆమెను బీజింగ్ తీసుకెళ్లారు వైద్యం కోసం. అక్కడ గంటకు పైగా శస్త్రచికిత్స చేసి ఆ కొమ్మును తీసేశారు. ప్రస్తుతానికి బామ్మగారికి కొమ్ము బాధ తప్పింది. మళ్లీ రాకుండా వుంటే బామ్మగారు అదృష్టవంతుల కిందే లెక్క.



'ఓ మహిళ బ్రాందీషాపుకెళ్లి మందు బాటిల్ తీసుకుని బహిరంగంగా గుటగుట తాగేస్తుంటుంది. వెంటనే సిగరెట్ తీసి దమ్ము కొడుతుంటుంది. "ఛ..ఛ..ఇదేం అలవాటు?!' అనుకునేలోపే 'గంగ జాతర కదా' అని గుర్తుకొస్తుంది. వేషం వేసిన మహిళ మగాడని తెలుసుకుని నవ్వుకుని వెళ్లిపోవడం ఆ జాతరలో హైలెట్.

విచిత్ర వేషాల జాతర

రాయలసీమలో వారం రోజుల పాటు జరిపే తాతయ్యగుంట గంగమ్మ జాతర ఎంతో విశిష్టమైనది. మండు వేసవిలో జిల్లా నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు వివిధ వేషధారణలతో వారం రోజుల పాటు తిరుపతి నగరాన్ని సందడి చేస్తారు. జాతర రోజు పెద్దమొత్తంలో జంతుబలులు ఇస్తారు. తిరుపతి చుట్టుపక్కల ఉన్న గ్రామీణులంతా నగరానికి విచ్చేసి మొక్కుబడి తీర్చుకుంటారు. ప్రతి ఏటా వారం రోజుల పాటు తిరుపతి నగరాన్ని సంధడి చేసే 'గంగజాతర' విశేషాలు తెలుసుకుందాం.

స్థల పురాణం

క్రీ.శ. 16వ శతాబ్దంలో తాతాచార్యులు వంశస్థులకు కైంకర్యార్థం లభించిన చెరువుకు తాతయ్యగుంట అనే పేరు వచ్చింది. తాతాచార్యులచే చెరువు (గుంట) పక్కన గంగమ్మను ప్రతిష్టించడం వల్ల ఆమెకు 'తాతయ్య గుంట గంగమ్మ' అనే పేరు వచ్చింది. పూర్వం తిరుమల తిరుపతి యాత్రకు వచ్చే భక్తులు మొదట ఆ గ్రామదేవత గంగమ్మకు మొక్కి తరువాత తిరుమల కొండ ఎక్కేవారు. గంగమ్మ శ్రీ వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా వ్యవహరించడం వల్ల నేటికీ తిరుమల తిరుపతి దేవస్థానం నుండి చీర, రవిక, పసుపు, కుంకుమ, గాజులను (సారె) అమ్మవారికి గంగజాతర ముందురోజున పంపడం ఆనవాయితీగా జరుగుతోంది.

గంగమ్మ కథ

పూర్వకాలంలో తిరుపతిని పాలెగాళ్లు పాలించేవారు. అప్పటి పాలెగాళ్లు యవ్వనంలోని స్త్రీలను కామించి, చెరిచేవాళ్లట. వారిని హతమార్చేందుకు, స్త్రీజాతిని కాపాడేందుకు ఆదిపరాశక్తి గంగమ్మ దేవతగా అవతరించిందని పురాణ గాథ. విషయం తెలుసుకున్న అప్పటి పాలెగాడు ప్రాణభీతితో గంగమ్మకు కనిపించకుండా దాక్కుంటాడు. పాలెగాడిని బయటకు రప్పించడానికి గంగమ్మ రోజుకో వేషం వేసుకుని బూతులు తిడుతూ సంచరిస్తుండగా చివరకు దొరవేషంలో పాలెగాడిని కనిపెట్టి అతని తలనరికి హతమారుస్తుందట. ఇదంతా చైత్రమాసంలోనే జరిగిందని కొందరి విశ్వాసం. అందుకే ఆ నెల చివరివారంలో గంగమ్మ జాతర ఉత్సవాలను నిర్వహిస్తారు. అప్పట్లో పాలెగాడిని కనిపెట్టడానికి ఏవిధంగా గంగమ్మ రోజుకో వేషంతో సంచరించిందో, అలాగే భక్తులు వారం రోజుల పాటు రోజుకో వేషం ధరించి బూతులు తిడుతూ సంచరిస్తే గంగమ్మ దేవత పరవశించి తమ కోర్కెలు తీరుస్తుందని భక్తుల విశ్వాసం. జాతి, కుల, మత బేధాలు లేకుండా అత్యధిక సంఖ్యలో జాతర వేడుకల్లో పాల్గొంటారు. జాతర ప్రారంభ సూచికగా మంగళవారం అర్ధరాత్రి చాటింపు వేస్తారు. తిరుపతి సమీపంలో అవిలాల గ్రామం గంగమ్మ జన్మస్థలం. అందువల్ల ఈ ఉత్సవ ప్రారంభ సూచికగా చాటింపు రోజున తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం వారు అవిలాలలోని గంగమ్మగుడి వద్ద గ్రామపెద్దల నుండి పసుపు, కుంకుమలు తీసుకుని జాతర చాటింపుతో ఉత్సవాలను ప్రారంభిస్తారు.

బైరాగి వేషం

మండుటెండలను సైతం లెక్కచేయకుండా మొదటిరోజు బైరాగి వేషంలో భక్తులు దర్శనమిస్తారు. శరీరమంతా నామంకొమ్ము విభూతి పూసుకుని రేళ్లకాయల మాలలు ధరించి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. ఇంటిదగ్గర బయల్దేరినప్పటినుండి బూతులతో జనాలను భయపెట్టినా, పసుపు, కుంకుమ, వేపాకు సమర్పించి అమ్మవారి పాదాలపై పడతారు. భక్తులు వయోబేధాలు లేకుండా వేషాలు వేయడానికి పోటీలు పడతారు.



బండ వేషం

శరీరమంతా రక్తం చిందినట్లు కుంకుమ రాసుకుని కాటుక బొట్లు, తెల్లటి పూలు చుట్టుకుంటారు. చిన్నాపెద్దా, ముసలీముతక అందరూ ఈ వేషం ధరించి, బొరుగుల హారాలు చుట్టుకుని, కర్రలు చేతబడతారు. లయబద్ధంగా డప్పులు కొడుతూ, పాటలు పాడుతూ ప్రజలందరినీ ఆకర్షిస్తారు.

తోటి వేషం

మధ్యాహ్నం పూట బొగ్గు పొడి ఒళ్లంతా పూసుకుని తెల్లనామం సాది కనుబొమలపైన చుక్కబొట్లు పెట్టుకుంటారు. పిల్లలు మీసాలను పెట్టుకుంటారు. నడుం చుట్టూ, తలకు వేపాకు మండలను కడతారు. పాత పొరక, చేట చేతబట్టుకుని ఎదురుపడ్డవారిని తిన్నగా మోదుతుంటారు. బూతుపాటలు పాడుకుంటూ వేశాలమ్మ గుడికెళ్లి అక్కడనుండి గుడికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.

దొరవేషం

దొర వేషాన్ని కైకాల, చాకలి కులస్తులు ఆనవాయితీగా వేస్తారు. ఈ వేషాన్ని ఇతరులు ఎవరూ వేయరు. దొరవేషాన్ని కైకాల కులస్తులు, మంత్రివేషాన్ని చాకలి కులస్తులు వేస్తారు. ఊరంతా తిరిగి పూజలందుకుంటారు.

మాతంగి వేషం

ఈ వేషం వేసినవారు తలకు పసుపు గుడ్డను జడలా కట్టి కొప్పుముడి వేసి దానికి మల్లెపూలను చుట్టుకుంటారు. శరీరమంతా గంధం పూసుకుని తెల్లగళ్ల చీర లేదా పసుపు చీర కట్టుకుని రవికె తొడుక్కుంటారు. మెడలో పూలహారం వేసుకుంటారు. ఒడబాలు కట్టుకుని అందులో అక్షింతలు, దువ్వెన, కుంకుమభరిణ, రవికగుడ్డ, పసుపు పెట్టుకుంటారు. మాతంగి అంటే వెయ్యికళ్ల దేవత అని ముఖానికి ఒళ్లంతా నల్లని, ఎర్రని బొట్లు పెట్టుకుంటారు. పలకలు వాయిస్తూ, కొమ్ములు ఊదుతూ ఉంటే మాతంగి వేషగాళ్లు లయబద్ధంగా చిందులు వేస్తూ వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.

సున్నపుకుండలు (వెయ్యి కళ్ల దుంతలు)

సున్నపు కుండల వేషాన్ని ఇద్దరు కైకాల కులస్తులు వేస్తారు. పెద్ద గంగమ్మ, చిన్న గంగమ్మలకు ప్రతీకలుగా ఈ వేషాన్ని వేస్తారు. వీరు పట్టణంలోని ప్రతి ఇంటికీ వెళ్లి హారతులు అందుకుంటారు. సున్నపు కుండల వేషధారులను భక్తులు కుర్చీలలో కూర్చోబెట్టి కాళ్లు కడిగి పాదపూజ చేస్తారు. స్థానికులు వివిధ రకాల వేషాలు వేసుకుని అమ్మవార్లను దర్శించుకుంటారు.

సప్పరాలు

గోపురాన్ని పోలిన సప్పరాలను వెదురు దబ్బలతో తయారు చేస్తారు. వాటిని శరీరంపై విలబెట్టుకోవడం కోసం బాధను భరించి నడుముకు గుచ్చుకోవడం గంగమ్మ జాతరలో ఒక ప్రత్యేకత. కోరిన కోర్కెలు నెరవేరుతాయన్న నమ్మకంతో శరీర ఆకృతికి అనుగుణంగా సప్పరాలను ఏర్పాటు చేసుకుంటారు. సోమవారం రాత్రి నుండి గంధం పూసుకుని మెరిసే దుస్తులను నడుముకి ధరిస్తారు. మల్లెపూలను తలపాగాలా చుట్టుకుంటారు. వెదురుపుల్లలు తెచ్చి నట్టింట పెట్టి కుంభం వేసి హారతులు ఇస్తారు. వెదురు దబ్బలను గోపురం ఆకారంలో తయారు చేసి రంగు కాగితాలను అతికిస్తారు. గోపురంలో బొమ్మల్లా బెండ్లతో కళాత్మకంగా తయారు చేసి అమరుస్తారు. లయబద్ధంగా చిందులు వేస్తూ అమ్మవారిని దర్శించుకుంటారు.

పేరంటాల వేషం

పేరంటాలు వేషాన్ని కైకాల వాళ్లే ధరిస్తారు. ఎర్రగళ్ల చీరను కట్టి ఎర్రని గుడ్డలో ఒడిబాలును కడతారు. అందులో అక్షింతలు, చవ్వాకు, దువ్వెన, అద్దం, నల్లగాజులు, పసుపు, కుంకుమలు ఉంచుతారు. తలకు నల్లని గుడ్డను కట్టి కొప్పులా ముడేస్తారు. ఆ కొప్పులో పూలు చెక్కుతారు. తలపైన బంగారంలా కనిపించే అట్టలతో చేసిన జడబిళ్లలు, పట్టీలు వంటి ఆభరణాలు కట్టుకుంటారు. పంబల వాయిద్యాలతో చాటు మండపం వద్దకు వెళ్తారు. ఆ తర్వాత బేరిశెట్టి ఇంటికి, అక్కడ్నుండి ఇంకొన్ని చోట్లకు వెళ్లి పేరంటాల పూజలు అందుకుని నేరుగా వెళ్లి చిన్న గంగమ్మ చెంపను నరికి ఆ తరువాత పెద్ద గంగమ్మ చెంపను నరకడంతో జాతర పూర్తవుతుంది.

జాతర ముగింపురోజు బంకమట్టి, గడ్డితో తయారు చేసిన అమ్మవారి విశ్వరూపం చెంప తొలగించిన తరువాత ఆ మట్టి కొరకు భక్తులు ఎగబడతారు. అమ్మవారి విశ్వరూపం నుంచి వచ్చిన ఆ మట్టిని ఎంతో పవిత్రంగా పూజామందిరాలలో కాని, పెట్టెలలో కాని ఉంచుకుంటారు.

- వళిగళం గోపి,

- అవనిగడ్డ వనజ.



పదిహేనేళ్ల క్రితం అదో సాదాసీదా గ్రామం. పేదరికం...కరువు...నీటి సమస్య... నిరక్షరాస్యత... చూద్దామన్నా కానరాని మరుగుదొడ్లు... మద్యపాన సేవనం... అనైక్యత... ఎవరికి వారే యమునా తీరే...చందంగా వుండేది. ఇదంతా తల రాత అని సరిపెట్టుకుని వుంటే ఎలా వుండేదో! కానీ ఆ గ్రామస్థులు అలా చేయలేదు. ఎవరికోసమో ఎదురుచూడకుండా .... తమ తల రాతలను తామే రాసుకోవాలనుకున్నారు. సంఘటితమయ్యారు. సాధించారు. పచ్చదనం, పరిశుభ్రత, రోడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మద్యపాన నిషేధం, వంద శాతం అక్షరాస్యత, పొదుపు, పన్ను వసూలు, కుటుంబ నియంత్రణ... అన్నీ సాధించారు. తోటి గ్రామాలకు ఆదర్శమయ్యారు. అవార్డుల పంట పండించారు. ఇంతకీ ఆ గ్రామమేదంటే....వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి. మరి ఆ విశేషాలేంటో ఈ వారం అట్టమీది కథలో చూద్దామా...

పరిమళించిన పల్లె

కూస రాజయ్య వయస్సు 46 సంవత్సరాలు. ఇంటికి పెద్దదిక్కు ఆయనే. వ్యవసాయ కూలీగా పొద్దంతా బండెడు కష్టం చేసి సాయంత్రానికి గుడుంబా సేవించేవాడు. ఆరోజు కూడా పొద్దంతా కష్టపడి పనిచేసిన రాజయ్య రాత్రికి గుడుంబా తాగాడు. ఇంటికెళ్లి భార్యతో గొడవపడ్డాడు. చాలాసేపు ఆమెను తిట్టాడు. [illegible]కుండా అట్లాగే నిద్రలోకి జారుకున్నాడు. ఇక అంతే మళ్లీ మేలుకోలేదు. దీంతో కుటుంబం వీధినపడింది. పెద్దదిక్కు లేకుండా పోయింది. పిల్లలు కూలీలుగా బతుకు వెళ్లదీయాల్సిన దుస్థితి దాపురించింది.

◆◆◆

గోనె బుచ్చయ్యకు 35 సంవత్సరాలు. చూడ్డానికి 60 సంవత్సరాల వృద్ధుడిలా కనిపిస్తాడు. ఫ్లోరైడ్ నీటిని తాగడంతో కాళ్లు చేతులు, కీళ్ల నొప్పులతో బాధపడేవాడు. కొద్దిదూరం నడిచినా ఆయాసం వచ్చేది. సరిగ్గా నిలబడడానికి కూడా ఇబ్బంది పడేవాడు.

◆◆◆

ఇలాంటివి ఒకప్పటి గంగదేవిపల్లిలో సర్వసాధారణం. వీటికి తోడు నిత్యం వేధించే పలు సమస్యలు. చదువుకున్న వారి సంఖ్యకూడా వేళ్లమీద లెక్కించేంత మాత్రమే ఉండేది. గ్రామాభివృద్ధిని, వనరుల అభివృద్ధిని పట్టించుకునే వారే లేరు. ఊళ్లోకి రావడానికి సరైన రోడ్డు ఉండేది కాదు. గతుకులు, గుంతలు పడ్డ రోడ్డు ఉండేది. రేగడి నేల కావడంతో చినుకు పడిందంటే నడవడం కష్టంగా మారేది. మరుగుదొడ్ల మాటే గ్రామస్తులకు తెలియదు. బహిరంగంగానే మల, మూత్ర విసర్జన చేసేవారు. దీంతో రోడ్డంతా అస్తవ్యస్తంగా, అపరిశుభ్రంగా ఉండేది. ఈ గ్రామంలో వాగులు గానీ, చెరువులు గానీ లేవు. నానాటికీ భూగర్భజలం అడుగంటిపోయేది. ఊళ్లో మంచినీటి కరువు చాలా తీవ్రంగా ఉండేది. ఊరంతటికీ ఒక బావి మాత్రమే ఉండేది. అందులోనూ నీళ్లు అంతంత మాత్రమే (ఎప్పటివప్పుడు తోడేస్తారు కదా). గ్రామస్తులందరూ బిందెలు పట్టుకుని వరుస క్రమంలో నీళ్లు తోడుకునేవారు. రాత్రింబవళ్లూ ఇదే వరుస ఉండేది. అయినా సరిపడా నీరు దొరికేది కాదు. మంచినీటి యుద్ధాలు జరిగేవి. గోలలు, బకెట్లు, బిందెల చప్పుళ్లతో బావి దగ్గర రేయింబవళ్లూ జనం ఉండేవారు. సరిపడా నీరు దొరకకపోవడంతో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత ఉండేది కాదు.

తమ బతుకులింతే అనో, తల రాత అనో, చేసుకున్నవాడికి చేసుకున్నంత అనో వీటన్నిటినీ భరించేవారు. అయితే కూసం రాజమౌళి (ప్రస్తుత సర్పంచ్) వామపక్ష భావజాలం గల మిత్రులు గోనె చేరాలు, చల్ల రామయ్య, కూసం నారాయణ, పెండ్లి రాజయ్యతో చర్చించారు. గ్రామం కోసం ఎంతోకొంత చేయాలనుకున్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలనుకున్నారు. ముందుగా గ్రామాన్ని శాసిస్తున్న సారాయిని వెంటనే నిర్మూలించాలని భావించారు. తమ ఊరిని వేలెత్తి చూపేలా వుండకూడదనుకున్నారు. పదుగురికి ఆదర్శప్రాయంగా వుండాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా కార్యరంగంలోకి దిగారు.

మద్యం మాన్పించారు

నాటు సారాయి తాగి గ్రామంలో అనేక మంది అనారోగ్యానికి గురవుతుండేవారు. కుటుంబ తగాదాలు...ఆత్మహత్యలు నిత్యం వుండేవి. వీటన్నింటికీ సారాయి, బ్రాందీ, విస్కీ, కారణమని వీటిని నివారించాలని గ్రామంలో మద్య నిషేధ కమిటీని కూసం రాజమౌళి ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో గ్రామ యువకులు, మహిళలు ఉన్నారు. వీరు చేయాల్సిన పని గ్రామంలో ఏరులై పారుతున్న సారాయిని నిరోధించడమే. సారాయి బారిన పడుతున్న ప్రజలను రక్షించాలని ఈ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీ సభ్యులు సారాయి, మద్యం వల్ల వచ్చే ఇబ్బందులు, బాధలను గ్రామస్తులకు వివరించారు. అనారోగ్యాల బారిన పడుతున్న పరిస్థితిని, చిన్నతనంలోనే మహిళలు వితంతువులవుతున్న దుస్థితిని వివరించారు. జిల్లా అధికారులు, నాయకులను కమిటీ సభ్యులు గ్రామానికి పిలిపించుకుని సాయంత్రం పొద్దుపోయాక సభలు-సమావేశాలు నిర్వహించేవారు. తాగుడు మానేయమని ప్రచారం చేశారు. "మా డబ్బుతో మేం తాగుతున్నాం, మీరేమైనా ఇస్తున్నారా? మీకేంటి నొప్పి?" అని అనేక మంది ఎదురు తిరిగారు. కానీ లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదలతో భరించారు. వీరందరినీ ఎలాగైనా మార్చాలనే ఆలోచనతో ముందుకు సాగారు. పట్టువిడవకుండా తుదివరకూ పోరాటం సాగించారు. కమిటీ ఏర్పాటుచేసిన సంవత్సరంలోపే విజయం సాధించారు. ఈ విజయం గ్రామంలోని యువకుల్లో, మహిళల్లో ఉత్సాహం పెంచింది. కమిటీగా ఏర్పడడం, గ్రామంలో పలువురు కమిటీ సభ్యులుగా ఉండడం వల్ల విజయం సాధ్యమైందని అందరూ సంతోషించారు. ఈ గ్రామంలో ఇదే ప్రజల మొదటి విజయం. ఇప్పుడు గ్రామంలో గుడుంబా తయారీ కానీ, అమ్మకం కానీ, ఒక్క బెల్టుషాపుగానీ లేదు. గ్రామంలో ఉదయం ఎలా ప్రశాంతమైన వాతావరణం ఉంటుందో సాయంత్రమైనా, రాత్రయినా అంతే ప్రశాంతత కనిపిస్తోంది. మద్యం మానేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నారు. పనులపై మనసుపెట్టి పిల్లలకు ఉన్నత చదువులు చదివిస్తున్నారు.

నీటినీ సాధించారు

సంపూర్ణ మద్యనిషేధం అమలు చేస్తున్న గ్రామంగా గంగదేవిపల్లికి పేరుంది. కానీ మంచినీటి సమస్య మాత్రం తీవ్రంగా ఉండేది. ప్రస్తుత సర్పంచ్ కూసం రాజమౌళికి మండల, జిల్లా వ్యాప్తంగా అధికారులతో, పెద్దలతో పరిచయాలు సంబంధాలు ఉన్నాయి. పైగా ఆంధ్రాబ్యాంకు అధ్యక్షులుగా (1990లో) ఆయనకు బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులతో పరిచయాలున్నాయి. గ్రామంలో మంచినీటి సమస్యను స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులకు వివరించి, తమ గ్రామానికి సహాయం చేయాలని కోరారు. సంస్థ ప్రతినిధులు గ్రామానికి వచ్చి పరిశీలించి 15 శాతం ప్రజలు నిధులు ఇస్తే మిగతా నిధులు వెచ్చించి వాటర్ ట్యాంకు నిర్మించడానికి ఒప్పుకున్నారు. 1993లో 90 వేల లీటర్ల మొదటి ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని బాలవికాస సేవా సంస్థ నిర్మించింది. నీరు ఉపయోగం, గ్రామాభివృద్ధిని చూసి సంస్థ 1998లో రెండో ఓవర్‌హెడ్ ట్యాంకును సేవాసంస్థే నిర్మించింది. అయితే ఈ నీరు వృధా కాకుండా అవసరాలకు మాత్రమే వాడుకునేలా ఏం చేయాలని ఆలోచించిన సర్పంచ్ రాజమౌళి మంచినీటి నిర్వహణ కమిటీని ఏర్పాటుచేశారు. గ్రామంలో అత్యంత కీలకమైనది, శక్తివంతమైనది. గ్రామాభివృద్ధికి కారకమైన కమిటీ ఇది. ప్రతినెలా 3వ తేదీన సమావేశం ఉంటుంది. నల్లా వినియోగదారులకు కొన్ని నిబంధనలు విధించారు. నల్లాపైపు 1/2 ఇంచు మాత్రమే ఉండాలి. భూమి లెవల్ నుంచి నల్లా నాలుగుఫీట్ల ఎత్తులో ఉండాలి. ఆన్, ఆఫ్ బటన్ తప్పనిసరిగా ఉండాలి. ట్యాంకు కట్టుకుని ఎన్ని నీళ్లయినా పట్టుకోవచ్చు కానీ కింద పొర్లిపోకూడదు. మొక్కలు పెంచుకోవచ్చు. కానీ నల్లా పైపుతో మాత్రం నీళ్లు పట్టకూడదు. బకెట్లతో తీసుకెళ్లి మొక్కలకు పోయాలి. పైపుతో మొక్కలకు నీళ్లు పెడితే వంద రూపాయల జరిమానాతో పాటు నల్లాను రెండు రోజుల పాటు బంద్ చేస్తారు. తప్పయిందని మరోమారు తప్పు జరగదని ఇంటి యజమాని కమిటీ సభ్యులకు తెలపాల్సి ఉంటుంది. ఈ కమిటీ వార్షిక సమావేశం సంవత్సరానికి ఒకసారి జరుగుతుంది. డబ్బులు జమ, ఖర్చులు చర్చిస్తారు. వినియోగదారుడికి ఖర్చు, జమకు సంబంధించిన షీట్‌ను కమిటీ సభ్యులు ఇస్తారు. గ్రామంలోని నల్లా వినియోగదారులందరూ నెలనెలా డబ్బులు కట్టాల్సిన అవసరం లేదు. ఒకసారి డబ్బులు కడితే సరిపోతుంది. ప్రస్తుతం నల్లా కనెక్షన్ కావాలంటే కమిటీ నిర్ణయించిన డబ్బును చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అది ఆరువేల రూపాయలు ఉంది. భవిష్యత్తులో ఎలాంటి నీటి పన్నూ కట్టాల్సిన అవసరం లేదు. గ్రామంలో ఎక్కడైనా పైపు పగిలితే గ్రామపంచాయతీ మైకులో తెలియజేస్తారు. దీంతో గ్రామస్తులు వెంటనే గునపం పారలతో వచ్చి గంటలో మరమ్మతు చేస్తారు.

రుణాలు...చెల్లింపులు...

గ్రామాన్ని దత్తత తీసుకున్న బ్యాంకులు వ్యక్తిగత రుణాలు, పంటరుణాలు, ప్రభుత్వ పథకాల అమలుకోసం రుణాలు ఇస్తున్నాయి. రుణం సకాలంలో చెల్లించినప్పుడే గ్రామపరపతి పెరుగుతుందని గ్రహించిన సర్పంచ్ కూసం రాజమౌళి లోన్స్ రికవరీ కమిటీని ఏర్పాటుచేశారు. బ్యాంకుల్లో అప్పులు తీసుకున్న ప్రతి ఒక్కరూ సకాలంలో చెల్లించేలా ఈ కమిటీ పనిచేస్తుంది. అందరూ చెల్లించేలా వారికి తేదీని గుర్తుచేస్తుంది. లేకుంటే గ్రామానికి మరోమారు అప్పులివ్వడానికి బ్యాంకులు ముందుకు రావాలని వారికి తెలియజేస్తుంది. దీనివల్ల వడ్డీవ్యాపారులను ఆశ్రయించి ఎలా నష్టపోతామనేది ప్రజలకు అవగాహన కల్పించి చెల్లించేట్లు ఈ కమిటీ పనిచేస్తుంది.

వినోదం...విజ్ఞానం...

ప్రజలకు వినోదంతోపాటు విజ్ఞానాన్ని కూడా అందించాలనే ఆలోచనతో కేబుల్ ప్రసారాలు అవసరమని భావించి డిష్ వినియోగదారులైన 10 మందితో డిష్ కమిటీని నియమించారు.







అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారిని నియమించారు. ఈ కమిటీ ప్రతి సంవత్సరం వార్షిక సభను నిర్వహించి జమ, ఖర్చుల వివరాలు వినియోగదారులకు తెలియజేయాలి. ప్రతి సంవత్సరం కమిటీలోని 1/3 సభ్యులు రిటైరవుతారు. వారి స్థానంలో కొత్తవారిని లేదా తిరిగి పాతవారిని నియమిస్తారు. డిష్ కనెక్షన్ తీసుకున్నప్పుడు కమిటీ నిర్దేశించిన డబ్బు చెల్లించాలి. నెలసరి పన్ను ఉండదు. కనెక్షన్ తీసుకున్న సమయంలో చెల్లించిన డబ్బును అదే వినియోగదారులకు అప్పుగా కమిటీ ఇస్తుంది. ప్రతి నెలా వడ్డీ వసూలు చేస్తారు. ఈ డబ్బు పే ఛానల్స్‌కు, రిపేర్ ఖర్చులకు ఉపయోగిస్తారు. ప్రసారాలు అవాంతరాల్లో లేకుండా చూడడం ఈ కమిటీ బాధ్యత.

పచ్చదనం ... పరిశుభ్రత ...

గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత సాధించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. బాలవికాస స్వచ్ఛంద సేవాసంస్థ-మంచినీటి కమిటీ సహాయ సహకారంలో పిడబ్ల్యుడి రోడ్డు నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు కిలోమీటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షణ కోసం ట్రీ గార్డులను ఏర్పాటు చేసింది. గ్రామంలోని ప్రతి కుటుంబం ఒక మొక్క చొప్పున విధిగా పెంచాలి. మొక్క పూర్తి బాధ్యత కుటుంబానిదే. వారానికి రెండుసార్లు శని, మంగళ వారం మొక్కకు నీళ్ల తప్పనిసరిగా పోయాలి. లేనిపక్షంలో డీఫ్లోరినేషన్ వాటర్ క్యాన్‌ను ఆ రోజు ఇవ్వరు. ఈ కమిటీ ప్రకటించిన సమయంలో వారివారి ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. లేకుంటే కమిటీ సభ్యులు గమనించి తగిన చర్యలు తీసుకుంటారు. చెట్లు పెంచడంతో గ్రామంలో ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తోంది. స్వచ్ఛమైన గాలి వీస్తోంది.

అందరికీ ఆరోగ్యం

మనిషన్నాక రోగాలు రాకుండా వుంటాయా! వాటిని నయం చేయడానికి ఆసుపత్రులు, వైద్యులు అందుబాటులో లేకపోతే ఇంతే సంగతులు! అందుకే అందరికీ ఆరోగ్యం కోసం ఒక కమిటీని ఏర్పాటుచేసుకున్నారు. ఎఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, పిఎంపిలు ఈ కమిటీలో సభ్యులు. వాతావరణ మార్పుల వలన, సీజన్ వారిగా వచ్చే జబ్బుల సమయంలో గ్రామంలోని అన్ని వాడలు తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటారు. వ్యాధి భారిన పడ్డ వారికి మందులు అందజేస్తారు. తగ్గకుంటే డాక్టర్ వద్దకెళ్లాలని సలహా ఇస్తారు. రెండోసంతానం కలగగానే జన్మించిన పాప, ఆతల్లి క్షేమసమాచారం తెలుసుకుని పలకరిస్తారు. రెండవనెల దాటగానే మళ్లీ పోయి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని కుటుంబనియంత్రణ పాటించాలని ప్రోత్సహిస్తారు. 2000 సంవత్సరం నుంచి ఇద్దరు పిల్లలతోనే కుటుంబ నియంత్రణ పాటిస్తున్నారు.

అక్షరం అమూల్యమని తెలిసిన వేళ

గ్రామంలో ఒకప్పుడు చదువుకున్న వారి సంఖ్య చాలా తక్కువగా వుండేది. పైగా చదువుకొని ఉద్యోగాలు చేయాలా! ఊళ్లేలాలా!! అనేకునేవారు. అలాంటి గ్రామంలో నేడు కనిపిస్తున్న పాఠశాలను చూస్తే ఆశ్చర్యపోవాల్సి వస్తుంది. ఎందుకంటే అది జూనియర్ కళాశాలను పోలి ఉంది. విశాలమైన క్రీడాస్థలం, తరగతులకు సరిపడా గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, వంటగదులు ఉన్నాయి. ఇదెలా సాధ్యం? అంటే విద్యా కమిటీ వల్లే. పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యాబోధన, సిలబస్ అంశాలను విద్యాకమిటీ పరిశీలిస్తుంది. విద్యార్థుల మధ్యాహ్న భోజనం, పాఠశాలకు వసతులు కల్పించడంలో ఈ కమిటీ

ప్రజాసేవకుడిగా పనిచేయాలి

ప్రజలు ఓటుహక్కుతో ఎన్నుకున్నప్పుడు వారి సమస్యల పరిష్కారం కోసం ఓ ప్రజాసేవకుడిలా పనిచేయాలి. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి. పదవీ వ్యామోహంతో ప్రజలను విస్మరిస్తే ప్రజలు తిరస్కరిస్తారు. ప్రజాసమస్యలు పట్టించుకున్నప్పుడే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. ప్రతిఫలం ఆశించకుండా చేసే పద్ధతిని ప్రజాప్రతినిధులు అలవర్చుకోవాలి. నిస్వార్థంలో ప్రజాసేవకు అంకితం కావాలి. అప్పుడే ప్రజాప్రతినిధిగా న్యాయం చేసినట్లు లెక్క.

-కూసం రాజమౌళి

అవార్డులెన్నో

గ్రామస్థులంతా కలిసికట్టుగా ఎన్నో అవార్డులు సాధించారు. పలు సందర్భాలలో తమ గ్రామ ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్పారు. ఉత్తమ గ్రామపంచాయతీగా జాతీయస్థాయి అవార్డు అందుకుంది. ఇప్పటికి ఈ గ్రామం మండల స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డును రెండుసార్లు అందుకుంది. జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీగా నాలుగు సార్లు ఎంపికైంది. ఎల్ఐసి వరంగల్ వారి బీమాగ్రాం అవార్డు అందుకుంది. భారత రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం చేతులమీదగా అత్యంత ప్రతిష్టాత్మకమైన "నిర్మలా గ్రామపురస్కార్" అవార్డును సర్పంచ్ అందుకున్నారు. 100 శాతం కుటుంబాలు చిన్నమొత్తాల పొదుపు చేసినందుకు జిల్లా స్థాయిలో అవార్డు పొందింది. సంపూర్ణ పారిశుధ్యంలో జిల్లాలోనే మొదటిగ్రామంగా "శుభ్రం" అవార్డు వరించింది. ఇటీవల కాలంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ అవార్డు సైతం వచ్చింది. గూగుల్ అవార్డ్ రాష్ట్రంలో ఐదు గ్రామపంచాయతీలకు వస్తే దాంట్లో నాలుగు గంగదేవిపల్లిని సందర్శించి ఇక్కడి పాలనను తెలుసుకుని అమలు చేసినవే కావడం విశేషం. వాటిలో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కొండాపూర్, ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మేడేపల్లి, కర్నూలు జిల్లా నంద్యాల పాండురంగాపురం, తూర్పు గోదావరి జిల్లా జయగూరుపాడు ఉన్నాయి.

ఎన్నికలు ఇలా...

గంగదేవిపల్లి గ్రామపంచాయతీ 1995లో ఏర్పాటయింది (ఈ గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుంచి సిపిఎం పాలనలోనే ఉండడం విశేషం). ఎన్నికల్లో అందరూ మహిళలే పోటీచేయాలని గ్రామస్తులు నిర్ణయించారు. మహిళలు వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొంతమంది మాత్రం ఈ అభిప్రాయంతో విబేధించి సర్పంచ్ పదవి కోసం పోటీ పడ్డారు. పోటీచేసిన వ్యక్తికి కేవలం 24 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఐదేళ్ల పాలనను గ్రామ కమిటీలు సమీక్షించి 2000 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లోనూ అందరూ మహిళలే పోటీ చేయాలని తీర్మానించాయి. గంగదేవిపల్లి ప్రజలు ఐక్యంగా ఉండడాన్ని జీర్ణించుకోలేని కొన్ని పార్టీల మండలస్థాయి నాయకులు మళ్లీ మహిళలేంటని కొందరు పోటీచేయడంలో ఎన్నికలు జరిగాయి. కానీ అందరూ మహిళలే విజయం సాధించారు. ఓడిపోయిన వారు చాలా దారుణమైన ఓటమిని చవిచూడాల్సివచ్చింది. ఓడిన ఓ అభ్యర్థికి కేవలం ఒక్క ఓటు మాత్రమే వచ్చింది. అంటే అతని ఓటు అతను వేసుకున్నాడు తప్ప కుటుంబసభ్యులు కూడా వేయని పరిస్థితి. 2006లో గ్రామ కమిటీలు నిర్ణయించిన వారినే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కమిటీలతో కలిమి

గంగదేవిపల్లి గ్రామం ఇంత ప్రగతిని సాధించడానికి కారణం వారు వేసుకున్న కమిటీలు. వాటి పనివిధానం. ప్రతి ఇంటి నుంచీ ఎవరో ఒకరు ఈ కమిటీల్లో సభ్యులుగా వుంటారు. అంటే గ్రామాభివృద్ధిలో గ్రామంలోని ప్రతి ఒక్కరి పాత్రా వుంటుందన్నమాట. గ్రామంలో మొత్తంగా 19 కమిటీలు పనిచేస్తున్నాయి. 1. గ్రామపంచాయతీ కమిటీ 2. మంచినీటి నిర్వహణ కమిటీ 3. వీధిలైట్ల నిర్వహణ-స్థానిక సమస్యల పరిష్కార కమిటీ 4. మద్య నిషేధ కమిటీ 5. గంగా డిష్ కమిటీ 6. ఆరోగ్య కమిటీ 7. వృత్తిదారుల సమన్వయ కమిటీ 8. పచ్చదనం – పరిశుభ్రత కమిటీ 9. పౌర సరఫరాల కమిటీ 10. లోన్స్ రికవరీ కమిటీ 11. అంతర్గత ఆడిట్ కమిటీ 12. మహిళా సమస్యల పరిష్కార కమిటీ 13. చైతన్య శిక్షణ కమిటీ 14. పాఠశాల కమిటీ 15. తల్లుల కమిటీ 16. యువజన కమిటీ 17. మహిళా అభివృద్ధి కమిటీ 18. రైతు వికాస కమిటీ 19. గ్రామైక్యసంఘం. వీటితో పాటు వివిధ కమిటీల సమన్వయ కమిటీ ఉంటుంది. ఇవికాక గ్రామాభివృద్ధికోసం అప్పటికప్పుడు ఏమైనా సమస్యలు వస్తే తాత్కాలిక కమిటీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇవి తమ పరిధిలో ప్రణాళికలు వేసుకుని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తాయి.

కృషి చేస్తుంది. ఫలితంగా గ్రామంలో బడి ఈడు పిల్లలందరూ బడికి వెళుతున్నారు. బాలకార్మికులు లేని గ్రామం తయారవడానికి ఈ కమిటీ కృషి చేసింది. ఇప్పుడు 100 శాతం అక్షరాస్యత గ్రామంలో వెలుగొందుతోంది.

గ్రామంలోనే సమస్యలు పరిష్కారం...

ఏ గ్రామంలోనైనా గొడవలు, సమస్యలు ఎదురైతే ఏం చేస్తారు? పెద్దమనుషుల వద్దకు వెళతారు. అక్కడ పరిష్కారం కాకుంటే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదిస్తారు. కానీ గంగదేవిపల్లి గ్రామంలో మాత్రం సమస్యలు గ్రామంలోనే పరిష్కారమవుతాయి. గొడవలు జరిగేదే తక్కువ. ఎందుకంటే మద్యనిషేధం గ్రామంలో అమలవుతోంది కాబట్టి నేరాల రేటు చాలా తక్కువగా ఉంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 14 సంవత్సరాలుగా ఒక్క కేసు కూడా ఈ గ్రామపంచాయతీ నుంచి నమోదు కాలేదు. గ్రామంలో ఇరుగుపొరుగు వారికి గానీ, అత్తాకోడళ్లకు గానీ, తోడికోడళ్లకు గానీ అప్పుడప్పుడు గొడవలు జరుగుతాయి. వీరి గొడవలను పరిష్కరించేందుకు మహిళా సమస్యల పరిష్కార కమిటీ ఉంది. ఈ కమిటీని మహిళా వార్డు సభ్యులు, మహిళా పొదుపు సంఘాల నాయకులు ఎన్నుకున్నారు. వీరు కుటుంబంలోని మహిళలకు వచ్చే సమస్యలను గుర్తించి ఇరువురితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తారు. సమస్యకు కారణమేంటనేది ఇరువురిని కూర్చోబెట్టి కౌన్సిలింగ్ ఇస్తారు. సాధారణంగా సమస్య ఇంతటితోనే పరిష్కారం అవుతుంది. అప్పటికీ కాకుంటే సర్పంచ్ దాకా వెళుతుంది. దాదాపుగా సమస్య ఇక్కడ పరిష్కారం అవుతుంది. ఇంతేకాకుండా 11 మందితో స్థానిక సమస్యల పరిష్కార కమిటీ ఉంది. సమస్యలేమైనా ఉంటే ఇరువురూ ఈ కమిటీ దృష్టికి తీసుకువస్తారు. కమిటీ సభ్యులు ఇరువురితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తారు.

అభివృద్ధి పథంలో....

గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ మేర చెట్లు ఉన్నాయి. ఇవి గ్రామానికి ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదం ఇక్కడ అమలవుతోంది. చక్కటి ఆరోగ్యంతో జీవితం గడుపుతున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లే దర్శనమిస్తున్నాయి. జన్మభూమి నిధులు, సిడిఎఫ్ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎస్ఎఫ్ఐ నిధులు, గ్రామపంచాయతీ ఏకగ్రీవ ఎన్నిక నిధి, నిర్మలా గ్రామ పురస్కార్ నిధి, 'శుభ్రం' అవార్డు నిధి, టిఎస్‌సి నిధులు ఇలా అన్ని నిధులనూ సద్వినియోగం చేసుకుని గ్రామం మొత్తం సిమెంట్ రోడ్డు, అండర్ డ్రెయినేజీని నిర్మించుకున్నారు. దీంతో ఎక్కడా అపరిశుభ్రతకు చోటు లేకుండా ఉంది. వందశాతం ప్రజలు డీఫ్లోరైడ్ నీటిని తాగుతున్న గ్రామంగా రికార్డుకెక్కింది. ప్రతిఒక్కరూ డీఫ్లోరైడ్ నీటిని ఉపయోగిస్తున్నారు. అది కూడా మంచినీటి కమిటీకి సంవత్సరం మొత్తానికి 300 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. మరోఛార్జీలంటూ ఉండవు. ఇలా గ్రామం అభివృద్ధిపథంలో ముందుకెళుతోంది. అన్ని గ్రామాలు ఇలా ఉంటే ఎంత బావుండో...

-మామిండ్లపల్లి రాము,

వరంగల్.

కథ

అంతా గప్ చుప్!

హిందీ మూలం : జైనందన్
అనువాదం : ఆర్.శాంతసుందరి

ఒక బ్రహ్మాండమైన పాత్రలో పదాహారు వందల డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో కరిగిన ఉక్కు ఉంది. దాన్ని ప్లేట్‌ఫార్మ్ మీదున్న స్టీల్ ట్రాన్స్‌ఫర్ కారులోని పెద్ద పెద్ద బాల్చీల్లోకి పోసే పని జరుగుతోంది. సరిగ్గా అదే సమయంలో పైనున్న ఓవర్ హెడ్ క్రేన్ పైనుండి ఎవరో పనివాడు అగ్నిపర్వతం కన్నా వేడిగా మరుగుతున్న బాల్చీలలో ఒకదానిలో దబాల్న పడ్డాడు. ఎవరా దురదృష్టవంతుడు? ఇక అక్కడ మరునిమిషం ఒకటే ఉరుకులు, పరుగులు, గాబరా... దాదాపు డిపార్ట్‌మెంట్‌లోని అందరూ పరుగెత్తుకుని వచ్చారు. కానీ రెప్పపాటులో జరిగిన ఆ ప్రమాదం ఎవరికో తెలీదు. తెలిసినా ఎవరూ ఏమీ చెయ్యగల పరిస్థితి కాదది. ఎందుకంటే ఆ పడ్డవాడు, పడిన మరుక్షణం కాలిపోయి కరిగిపోయి నామరూపాలు లేకుండా పోయుంటాడని అందరికీ తెలుసు. ఆ బాల్చీలోని కరిగిన ఉక్కు ఎవరిమీదైనా ఒక్కచుక్క పడితే చాలు, అది తుపాకీలోని బులెట్ కన్నా ఘోరమైన గాయం చేస్తుంది. ఇక్కడ మనిషే అందులో పడిపోయాడు. డివిజన్ మేనేజర్‌తో సహా ఆ స్టీల్‌మేకింగ్ డిపార్ట్‌మెంట్‌లోని అందరు ఆఫీసర్లూ అక్కడికి వచ్చారు. వాళ్లు అక్కడే ఏవో మంతనాలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చినట్లు, వర్కర్లందరినీ వెంటనే కాన్ఫరెన్స్ రూమ్‌కి రమ్మన్నారు. అక్కడ అటెండెన్స్ తీసుకుంటామని చెప్పారు.

ఆ షిఫ్ట్‌లోని దాదాపు వందమంది కార్మికులు తమ తమ స్నేహితుల కోసం వెతుక్కున్నారు. ఇంతలో సీనియర్ మెకానిక్ తరుణ్ కూడా వాళ్లతో వచ్చి చేరాడు. అతను తన స్నేహితుడు ఎలక్ట్రీషియన్ సందీప్ కోసం వెతికాడు. అతను ఎక్కడా కనబడకపోయినా, అతనికి అటువంటి ప్రమాదం జరిగి ఉంటుందన్న ఆలోచన రావడమే తరుణ్‌కి నచ్చలేదు.

ఆ సమయంలో అక్కడున్న వాళ్లు ఒక్క క్షణం బాల్చీలో కొద్దిగా కదలిక చూశారు. అంతే, ఆ తర్వాత ఏమీ జరగలేదు. నిజంగా చావుకీ, జీవించి ఉండడానికీ మధ్య దూరం ఎంత తక్కువ! ప్రాణాలని కాపాడేందుకు ఈ శరీరమనే కవచం ఎంత బలహీనమైనది!!

శోకం, దుఃఖం, సందిగ్ధం లాంటి భావాలతో సతమతమవుతూ వర్కర్లు కాన్ఫరెన్స్ రూమ్‌కి చేరుకున్నారు. 'ఏ షిఫ్ట్' లోని వారంతా వచ్చేశారు. తరుణ్ కళ్లు ఇంకా సందీప్ కోసమే వెతుకుతున్నాయి. కానీ అతను కనబడలేదు. కంప్యూటర్‌లో ఫీడ్ చేసిన షీట్ అక్కడికి తెప్పించి ఒక్కొక్కరి పేరూ పిలిచి అటెండెన్స్ మార్క్ చెయ్యడం మొదలు పెట్టారు.

'రిటైరయ్యే వయసుకి చేరుకున్న కార్మికుడెవరైనా కావాలనే చనిపోలేదు కదా?' అనే అనుమానం వచ్చింది డిప్యూటీ మేనేజర్‌కి. ఎందుకంటే, ఇప్పటికీ ఎవరైనా ప్రమాదంలో చనిపోతే అతని వారసుడికి ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇవ్వాలన్న రూల్ ఉంది. మొదట్లో కార్మికులు పాతికేళ్లు పనిచేస్తే చాలు, వాళ్ల కొడుక్కో, అల్లుడికో పని ఇచ్చేవాళ్లు. ప్రస్తుతం సాగుతున్న పోటీ ప్రపంచంలో దాన్ని రద్దు చేశారు.

డీఎమ్ మనసులో ఏం జరుగుతోందో పసిగట్టిన తరుణ్ విలవిల్లాడిపోయాడు. ఎంత దారుణం! జీవితం ఇంత భయంకరంగా, ఇంత సిగ్గులేకుండా ప్రవర్తించేట్టు ఎలా తయారైంది? తమ పిల్లల భవిష్యత్తు కోసం... ఇంతా చేస్తే ఒక చిన్న ఉద్యోగం కోసం ప్రాణాలైనా ఇచ్చేందుకు వెనకాడరా? తరుణ్ మనసు పరిపరివిధాల బాధపడసాగింది. అటెండెన్స్ తీసుకున్నాక డీఎమ్ సందేహం తప్పని తేలింది. కానీ అసలు నిజం తెలిసేసరికి దాన్ని తట్టుకోవడం కూడా కష్టమైపోయింది. బాల్చీలో పడ్డది సందీపేనని తెలిసింది. అతను ముసలివాడు కాదు. ఇరవయ్యారేళ్ల యువకుడు. అతను ఆత్మహత్య చేసుకోలేదు. ఓవర్‌హెడ్ క్రేన్‌లో ఏదో ఎలక్ట్రికల్ భాగం పాడైతే దాన్ని మరమ్మతు చేసేందుకు ఫోర్ మ్యాన్ పంపితే పైకి ఎక్కాడు. అప్పుడే జారిపడ్డాడు. నేలమీద పడ్డా బతికేవాడు కాదు. కానీ అప్పుడు అతని శరీరమన్నా దక్కేది.

ఆరోజు సాయంకాలం రాఖీ కట్టించుకునేందుకు అక్క దగ్గరకి వెళ్లాలనుకున్నాడు. తరుణ్‌ని కూడా తన వెంట రమ్మన్నాడు. పొద్దున పనిలోకొచ్చినప్పుడు కూడా ఇద్దరూ ఒకేసారి కంప్యూటర్‌లో కార్డు పంచ్ చేయించుకున్నారు. అవన్నీ గుర్తొచ్చి తరుణ్ కన్నీళ్ల పర్యంతమయ్యాడు.

శరీరం కాలిపోతే వచ్చే ఘాటైన వాసన ఆ ప్రదేశమంతా అలుముకుంది. అది కాన్ఫరెన్స్ హాల్లో ఉన్న వాళ్లకి కూడా తెలిసేంతగా వ్యాపించింది. అక్కడున్న వర్కర్లు దాన్ని భరించలేకపోయారు. వాళ్లకి శ్మశానంలో ఉన్నట్లే అనిపించింది. తరుణ్‌కి భోరుమని ఏడ్వాలనిపించింది. ఎంత ఆపుకుందామనుకున్నా కన్నీళ్లు ఆగట్లేదు.

డీఎమ్ అందర్నీ ఉద్దేశించి ఇలా అన్నాడు "ఫ్రెండ్స్! సందీప్ ఎంతో అనుభవమున్న ఎలక్ట్రీషియన్. చాలా కష్టపడి పనిచేసేవాడు. ఈ దుర్ఘటన నన్ను బాగా కుదిపేసింది. ఎవరో రిటైర్ అవబోతున్న వర్కర్ కావాలని పడ్డాడనుకున్నా గానీ సందీప్ లాంటి డైనమిక్ వర్కర్, స్మార్ట్ బాయ్ పడిపోయుంటాడని ఊహించలేదు. కానీ విధిని ఓడించడం ఎవరివల్లా కాదు. ఇప్పుడు మన ముందు పెద్ద సమస్య వచ్చి పడింది". అంత వరకు చెప్పాక డీఎమ్ రెండు క్షణాలు ఆగాడు. అందరి మొహాల్లోనూ కుతూహలం, ఏం చెబుతాడో వినాలని. అది గమనించిన డీఎమ్ మళ్లీ ఇలా అన్నాడు "ఐ.ఎస్.ఓ సర్టిఫికెట్ సంపాదించేందుకు ఏడాదిగా మనం ప్రయత్నిస్తున్నామని మీకు తెలుసు. ఆడిటింగ్ టీమ్ ఇక్కడికి వచ్చిందనీ, మన డాక్యుమెంటేషన్ సిస్టమ్‌ని ఆడిట్ చేస్తోందనీ మీకు తెలుసు. వాళ్లు ఏ క్షణమైనా షాప్‌ఫ్లోర్‌కి వచ్చి మిమ్మల్ని ఏమైనా అడగొచ్చు. ఈ రోజు ఈ విషాద సంఘటన జరిగిన వెంటనే నేనిలా మాట్లాడ్డం మీకు ఎబ్బెట్టుగా అనిపించవచ్చు..." డీఎమ్ మళ్లీ ఆగి అందరివైపూ ఒకసారి చూసి మళ్లీ మాట్లాడ్డం మొదలుపెట్టాడు. "కానీ ఈ దుర్ఘటన వల్ల తలెత్తిన పరిస్థితుల దృష్ట్యా ఇదంతా చెప్పాల్సి వచ్చింది. మీకు ఈ సంగతి ముందే చెప్పడం జరిగింది. కానీ ఇవాళ ప్రత్యేకంగా మళ్లీ చెబుతున్నాను. ఐ.ఎస్.ఓ ఇంటర్నేషనల్ స్థాయి సర్టిఫికెట్ మనకి రాకపోతే మనం తయారు చేసిన వస్తువులు ఎవరూ కొనరు. పోటీలో మనం వెనకే ఉండిపోతాం. అప్పుడు జరిగేదేమిటంటే, మన డిపార్ట్‌మెంట్ మూతబడిపోతుంది. మన భవిష్యత్తు కష్టాల్లో చిక్కుకుంటుంది".

డీఎమ్‌కి అందరి మొహాల్లోనూ ఆందోళన కనపడింది. వెంటనే తన ఉపన్యాసం కొనసాగించాడు. "ఒకవేళ ఆ ఆడిట్ టీమ్‌కి ఇక్కడ ఇంత భయంకరమైన ప్రమాదం జరిగిందని తెలిసిపోతే మన గురించి వాళ్లకున్న అభిప్రాయం దెబ్బతింటుంది. వాళ్లు నెగెటివ్ రిమార్క్ రాసినా రాస్తారు. ఇటువంటి దుఃఖ సమయంలో ఇదంతా మాట్లాడవలసి రావడం నాకూ బాధగానే ఉంది. కానీ ఏం చెయ్యను? చనిపోయినవాళ్ల వెంట మనమూ పోలేం కదా? ఆఖరికి వాళ్ల కుటుంబసభ్యులు కూడా ఎక్కువరోజులు ఏడుస్తూ ఉండిపోరు. వాళ్ల వాళ్ల పనుల్లో మునిగిపోతారు. ఇది వినడానికి ఎంత ఇబ్బందిగా ఉన్నా సరే మనం చెయ్యక తప్పదు. సందీప్ చనిపోయిన సంగతి మనం మన మనస్సుల్లోనే పాతిపెట్టెయ్యాలి. గుండె రాయి చేసుకుని ఇక్కడేమీ జరగలేదని చెప్పాలి. ఈ రోజు సందీప్ పనిలోకి రాలేదని చెపుదాం. మీ కోసం మీ కుటుంబాల కోసం మీరిక్కడ ఒక ప్రమాదాన్ని చూసిన సంగతి మర్చిపోవాలి".

కొంతసేపు అక్కడ నిశ్శబ్దం తాండవించింది. చీకటిరాత్రి లాంటి భయంకరమైన నిశ్శబ్దం! కానీ తరుణ్ మౌనంగా ఉండలేకపోయాడు. "అలా ఎలా చెబుతాం సార్?" అంటూ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. అతని కళ్లు నీళ్లతో నిండిపోయాయి. "ఉదయం సందీప్, నేనూ ఒకేసారి డ్యూటీలోకొచ్చాం. అతని తల్లిదండ్రులకి అతని డ్యూటీ శాశ్వతంగా ముగిసిపోయిందని తెలియజేసే బాధ్యత మనమీద ఉంది. వాళ్లు నన్నే అడుగుతారు. నేను అబద్ధం ఎలా చెప్పను?" అన్నాడు. అతను ఇక ఆపుకోలేక చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చాడు.

డీఎమ్ అతన్ని ఓదారుస్తున్నట్లు నటించి, తరుణ్‌కి ఓ ఆఫీసర్‌ని సాయమిచ్చి తన చేంబర్‌లోకి పంపేశాడు. తర్వాత చాలా బాధపడుతున్నట్లు మొహంపెట్టి "నేను తరుణ్ బాధని అర్థం చేసుకోగలను. కానీ ఇలాంటి సమయంలో మనం ప్రాక్టికల్‌గా ఆలోచించాలి. అతని కుటుంబంలోని ఐదుగురికోసం ఇక్కడ పనిచేస్తున్న వందమంది కార్మికులు సమస్యలకి గురవడం సరికాదు. అందుకని నేను మీకు ఇచ్చే చివరి సలహా,

ఎవరూ సందీప్‌కి జరిగిన ప్రమాదం గురించి నోరు విప్పొద్దు. ఇది అందరి మంచికోసం నేనిస్తున్న సలహా. ఇక మీరు వెళ్లి పనులు చూసుకోండి" అన్నాడు.

అక్కడ్నుండి కదిలిన వాళ్లందరి మొహాల్లోనూ పెద్ద బరువు మోస్తున్న భావం చోటు చేసుకుంది. వాళ్ల గుండెల్లో ఉన్న భారమే వాళ్ల మొహాల్లో ప్రతిబింబించింది. ఎటూ తేల్చుకోలేని ఒక సందిగ్ధావస్థ! డీఎమ్ మాటల్లో ఉత్త సలహా మాత్రమే లేదనీ, అది ఒక ఆదేశమని వాళ్లకి అనిపించింది. అతను చెప్పినట్లు చెయ్యకపోతే ఫలితాన్ని అనుభవించాల్సి వస్తుందన్న బెదిరింపు కూడా ధ్వనించింది.

అక్కణ్నుండి డీఎమ్ తన గదిలోకెళ్లాడు. ఏసీతో చల్లగా ఉన్న ఆ గదిలో తరుణ్‌కి తాగడానికి చల్లటి నీళ్ళిచ్చాడు. అతని భావాలని గౌరవిస్తున్నానని తెలియజేసేందుకు "తరుణ్! సందీప్ నీకు ప్రాణ స్నేహితుడని నాకు తెలుసు. అతని మరణాన్ని తట్టుకోవడం నీకు కష్టమే. కానీ నువ్వు చదువుకున్నవాడివి, తెలివైన వాడివి. కంపెనీ, అందులో పనిచేసేవాళ్ల మంచికోసం నువ్వు మనసును దిటవు చేసుకోక తప్పదు" అన్నాడు.

"నాకేమీ చెప్పకండి సార్! ఒద్దు ఆ విషయం మాట్లాడొద్దు. ప్రస్తుతం నేనేమీ వినే స్థితిలో లేను" అన్నాడు తరుణ్ ఇంకా ఏడుస్తూ. మరుక్షణం అక్కడినుండి బయటికి వెళ్లి సందీప్ పడిపోయిన బాల్చీ దగ్గరకెళ్లాడు. సలసలా మరుగుతున్న ఆ ద్రవాన్ని కళ్లార్పకుండా చూడసాగాడు. మాంసం కాలిన కమురు వాసన ఇంకా వస్తూనే ఉంది. అతని మనసు ఆక్రోశిస్తూ ప్రశ్నించసాగింది.

'సందీప్... ఒరే సందీప్! ఇలా చనిపోయావేంట్రా? పెద్ద పెద్ద ప్రమాదాల్లో నలిగిపోయి, చితికిపోయి, తెగిపోయి చనిపోవడం చూశాను. శవాలు గుర్తుపట్టలేనంతగా తయారవుతాయి. కానీ నువ్వు, నువ్వు చనిపోయిన తీరు... శవం కూడా మిగల్లేదే!? ఇలాంటి చావు ఇంతకుముందెన్నడూ చూడలేదు సందీప్! చూస్తుండగానే నువ్వు మృత్యుముఖంలోకి వెళ్లిపోయావు. ఎవ్వరం ఏమీ చెయ్యలేకపోయాం. మా కళ్లముందే నీ ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఒక్క ఎముక కూడా మిగల్లేదు కదరా గుర్తుకి. అసలు సందీప్ అనే మనిషే లేడన్నట్లు అయింది. ఎందుకిలా జరిగింది?

అసలు నేను ఇంతకుముందే నిన్ను హెచ్చరించాను. నువ్వెప్పుడూ ఒక్కడివే క్రేన్ పైకి ఎక్కిపోతూ ఉండేవాడివి. ఎంత చిన్న మరమ్మత్తైనా కరెంటుతో పని... అది చాలా ప్రమాదకరమైనదని పోయిన వారమే చెప్పాను.... అంతపైకి ఒంటరిగా ఎక్కి ఏమీ చెయ్యకురా అని. అసలు కరెంటు పని అంటేనే ఇద్దరు మనుషులుండాలి.

నువ్వేమన్నావు? "ఇదేమీ అంత ప్రమాదకరమైంది కాదులేరా, ప్యానల్‌లో స్విచ్ ట్రిప్ అవుతుంది. దాన్ని సరిచేయడమే. కానీ ఫోర్‌మ్యాన్ కూడా ఎప్పుడూ నన్నొక్కణ్ణే వెళ్లి బాగుచెయ్యమంటాడు. ఇక నేనొక చవటని, ఎదురు చెప్పడం కూడా రాదు!" అన్నావు. ఇప్పుడేమో ఈ డీఎమ్ నీ చావు గురించి ఒక్క మాట మాట్లాడ్డానికి వీల్లేదంటున్నాడు. నన్నేం చెయ్యమంటావురా? తరుణ్ మనసు ఇలా కొట్టుమిట్టాడుతూనే ఉంది. ఇంతలో అతని భుజం మీద ఎవరిదో చెయ్యి పడింది. అది అతని మరో స్నేహితుడు కేతన్ చెయ్యి. "తరుణ్ ఇక్కడ అలా ఎంతసేపు నిలబడ్డా నువ్వు చెయ్యగలిగింది ఏమీ లేదు. పద పోదాం!" అన్నాడు కేతన్.

వాళ్ల వెనకాల విభాగంలోని ఆఫీసర్లు నిలబడి ఇటే చూస్తున్నారు. వాళ్ల హావభావాలు 'నాటకాలు చాలు. చెప్పినట్లు వినకపోతే అనుభవిస్తావ్!' అన్నట్లు ఉన్నాయి.

కొంతసేపటికి ఆ పెద్ద పాత్రని ఓవర్‌హెడ్ క్రేన్ సాయంతో పైకి ఎత్తసాగారు. తరుణ్ వాళ్లు ఏంచేస్తారా అని ఆశ్చర్యంగా చూడసాగాడు. క్రేన్ దాన్ని తీసుకెళ్లి మళ్లీ ..... సెంటీగ్రేడ్‌లో మరిగించేందుకు వెసల్‌లో పోసింది. సందీప్ శరీరం తాలూకు చిన్న చిన్న ముక్కలేవైనా మిగులుంటే అవి కూడా కరిగిపోతాయి. ఇది చూసి సందీప్‌కి పట్టిన దుస్థితికి తరుణ్ మరింత కుమిలిపోయాడు. అతని అంతరాత్మ ఘోషించింది. అయ్యో సందీప్! నీ ఒళ్లు ఇప్పుడు పూర్తిగా ఉక్కుతో కలిసిపోయింది. అంటే ఇప్పుడు నువ్వు ఒక వంతెనగానో, రైలు కమ్ములుగానో, ఓడలో భాగంగానో మారిపోతావు. లేకపోతే పార, గునపం, పైపు, స్తంభం, కత్తి, రివాల్వర్... ఇలా ఏ వస్తువుగానైనా మారిపోయి గుర్తుపట్టలేకుండా అయిపోతావు. మళ్లీ మనిషిగా మాత్రం మారలేవు. కొత్తగా కాపురానికి వచ్చిన నీ భార్య, వయసు మళ్లిన మీ నాన్న.. ఎవరికీ నీ ఆచూకీ తెలీదు. బతికున్నావో లేదో కూడా తెలీనివ్వొద్దంటున్నారు ఈ రాక్షసులు. వాళ్లు మాత్రం కొన్ని వేల, లక్షల టన్నుల ఉక్కు తయారు చేస్తూ లాభాలు గడిస్తూ ఉంటారు.

కేతన్ మళ్లీ తరుణ్ వీపు తట్టి "పద తరుణ్! ఇక సందీప్‌ని మర్చిపో, అతను ఇక మనకి కనిపించడు. ఇంటికెళ్దాం పద!" అన్నాడు.

"కానీ కేతన్... సందీప్ ఉదయం ఇక్కడే ఉన్నాడు... ఇదే చోట!"

"అలాగని చెప్పేందుకు ఎటువంటి సాక్ష్యమూ మిగల్లేదు బ్రదర్!"

"కంప్యూటరుంది... ఇక్కడ ఆ సంఘటన చూసిన వాళ్లెంతమందో ఉన్నారు... నేనున్నాను!"

"అవును, కంప్యూటర్‌లో అతని అటెండెన్స్ ఉంది. కానీ ఇప్పుడు దాన్ని చెరిపేశారు. అందరూ అతని పేరు చూశారు. కానీ చూడనట్లు నటిస్తున్నారు. నువ్వొక్కడివే మిగిలావు. నువ్వూ నిర్ణయించుకో ఏం చేస్తావో.. సందీప్ చావు గురించి అందరికీ చెబుతావా? నీ ఉద్యోగాన్ని రక్షించుకుంటావా?"

సందీప్ తండ్రి ఇదే ఫ్యాక్టరీలో పనిచేసి రిటైరయ్యాడు. ఆయన వారం నుండి సందీప్ కోసం అన్ని చోట్లా వాకబు చేస్తూనే ఉన్నాడు. అందరి మొహాల మీదా ముసుగులున్నాయని తెలుసుకోడానికి ఆయనకి అట్టేకాలం పట్టలేదు. తరుణ్ అబద్ధం చెప్పవలసి వస్తున్నందుకు లోలోపల విపరీతంగా మదనపడసాగాడు. చివరికి ఒక నిశ్చయానికి వచ్చి, సందీప్ ఇంటికి బయలుదేరాడు. కానీ దారిలోనే సందీప్ వాళ్ల నాన్న ఎదురుపడ్డాడు. ఆయన మొహంలో వేదన, నిరాశ, దిగులు... తరుణ్ ఆయనతో "నేను మీ ఇంటికే బయలుదేరానండి" అన్నాడు.

ఆయన ఓసారి తరుణ్ కేసి చిత్రంగా చూసి "నీకెందుకు బాబూ కష్టం. నేనే వస్తున్నా మీ ఇంటికి. నీ మౌనాన్ని వినేందుకు. నీ మనసు పడే సంక్షోభాన్ని చూసేందుకు" అన్నాడు.

తరుణ్ మొహంలో నిస్సహాయతని చూసి మళ్లీ ఆయనే "ఒక పాతిక ముప్పై ఏళ్ల క్రితం కార్మికుల్లో ఎంత వేడి.. ఎంత ఐకమత్యం ఉండేదనుకుంటున్నావ్? ఏదైనా అన్యాయం జరిగితే అందరూ ఏకమై ఎదిరించేవారు... పోరాడేవారు.. అప్పట్లో ఇన్ని సౌకర్యాలు కూడా లేవు. ఎప్పుడూ అన్నిటికీ కొరతే. ఎన్నో రకాల కష్టాలుండేవి. ఐనా ఐకమత్యమే బలంగా, ధైర్యంగా ఎదుర్కొనేవాళ్లం!" అన్నాడు.

కొంచెం సేపు ఆగి ఆయన తరుణ్ మౌనాన్ని ఛేదించేందుకు మళ్లీ "ఇవాళ అందరికీ అన్ని రకాల సౌకర్యాలూ ఉన్నాయి. కొత్త కొత్త సాధనాలున్నాయి. ఐనా వీళ్ల మనస్తత్వం ఎంత మారిపోయింది. మనకేంటి!? అనేదే అందరి ఆలోచన. కంపెనీ లోపలైనా, బయటైనా ఏం జరిగినా పెదవి విప్పరు కదా!" అన్నాడు.

ఆయాసం తీర్చుకునేందుకు కొంచెం ఆగి, "నేను పనిచేసే రోజుల్లో ఒకసారి ఒక వర్కర్ చెయ్యి తెగిపోయింది. అతను పరధ్యానంగా ఉండడం వల్లే అలా జరిగిందని మేనేజ్‌మెంట్ నష్టపరిహారం ఇవ్వనంది. అతనికి నష్టపరిహారం ఇప్పించేందుకు మొత్తం కార్మికులందరూ సమ్మె చేశారు. అభివృద్ధి జరగాలంటే పోరాటం అవసరం. అలా వ్యతిరేకతను తెలియజేసే ధైర్యం లేకుండా పోయిందంటే ఇక చెడ్డరోజులు వచ్చాయనే అనుకోవాలి!" అన్నాడు.

సందీప్ వాళ్ల నాన్న మాటలు వింటున్న కొద్దీ తరుణ్ కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. కొంతసేపు మౌనంగా ఉన్నాక, ఆయన కళ్లు చెమర్చాయి. గొంతు మూసుకుపోయింది. వణికే గొంతుతో "బాబూ! వాడు నీకు చిన్నప్పటినుండీ తెలుసు. మీరిద్దరూ ప్రాణస్నేహితులు. వారం రోజులైంది. ఇప్పటి వరకు నీ నోటంట ఒక్క మాట కూడా రాలేదు. నీ మనసులో జరిగే సంఘర్షణ నాకు అర్థమౌతూనే ఉంది. తరుణ్! నువ్వు ఏం చెబితే అదే నిజమని నమ్ముతాను. చెప్పు... ఫ్యాక్టరీలో మరిగే ద్రవంలో పడి కాలిపోయింది సందీపే కదూ? చెప్పు తరుణ్... మా వాడే కదూ? అక్కడక్కడా అలాంటి మాటలేవో నాకు వినిపించాయి. నువ్వైతే అబద్ధం చెప్పవని నిన్ను అడుగుతున్నాను... చెప్పు బాబూ!" అన్నాడు.

ఇక తరుణ్ సంబాళించుకోలేకపోయాడు. ఆయన్ని వాటేసుకుని భోరుమని ఏడ్చాడు. "అవును... వాడు సందీపే అంకుల్! మీ అబ్బాయి... నా ప్రాణ స్నేహితుడు సందీపే! నేను సందీప్ కన్నా అభాగ్యుణ్ణి.. దరిద్రుణ్ణి. అసలు చచ్చిపోయింది నేనే. వాడు పోయాడని మీకు చెప్పే ధైర్యం కూడా నాకు లేకపోయింది"

ఆ పైన తరుణ్ మాట్లాడలేకపోయాడు. సందీప్ తండ్రి తరుణ్ వీపు నిమురుతూ ఓదారుస్తూ ఉండిపోయాడు. ఇద్దరి కళ్లలోంచి కన్నీళ్లు ధారాపాతంగా కారిపోతూనే ఉన్నాయి... ★

విషానికి విరుగుడు

పాముకాటుకు సాలీనా వేలాదిమంది మనదేశంలో మృత్యువాత పడుతున్నారు. పాముకాటుకు విరుగుడు మందు పాము విషం నుండి తయారు చేయాలి. తగినంత విరుగుడు మందు నిల్వ ఉండాలంటే పాము విషం ఎంతో అవసరం. అందుకే పాముల్ని బతకనివ్వండి. వాటిని చంపొద్దని వైద్య పరిశోధకులు చెబుతున్నారు. ప్రపంచంలో అతి ఖరీదైన వస్తువుల్లో పాము విషం ఒకటి. పాముజాతిని బట్టి ఒక గ్రాము విషం విరుగుడు మందుకు సేకరించాల్సిన విష పరిమాణం ఆధారపడి ఉంటుంది. నీటి పాములు కరిస్తే దానికి వాడాల్సిన విరుగుడు మందు ఖరీదు నేలపై తిరిగే పాము కరిస్తే వాడే మందు కన్నా చాలా రెట్లు ఎక్కువ.

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

పాముల్ని పట్టుకుని ప్రయోగశాలల్లో ఉంచి వాటి నుండి విషాన్ని తీసే సంస్థలు ఎన్నో వున్నాయి. కానీ పాముల్ని ఎంత జాగ్రత్తగా కాపాడినా ప్రయోగశాలల్లో అవి ఎక్కువకాలం జీవించడం లేదు.

పాములు పట్టే వృత్తిలో మంచి నిపుణులుగా ప్రసిద్ధి చెందిన కొంతమంది గిరిజనులు తాము పట్టుకున్న పాముల్లోని విషాన్ని కక్కించి తర్వాత వాటికి గ్లూకోజ్ ఇచ్చి వాటిని ఎక్కడ పట్టుకున్నారో అక్కడ వదిలేస్తారు. ఇలా చేయడం వల్ల ఆ పాములు స్వేచ్ఛగా వెళ్లిపోయి ఆరోగ్యంతో బతకగల్గుతున్నాయి.

యాంటీ వెనమ్ తయారీ

విషపూరితమయిన పాము ఎవరినైనా కాటేసినప్పుడు ఆ పాము కాటుకు గురైన వ్యక్తి శరీరంలో పాము విషానికి వ్యతిరేకంగా తాత్కాలికంగా వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు యాంటీ బాడీస్ తయారవుతాయి.

యాంటీవెనమ్‌ను గుర్రాల నుండి సేకరిస్తారు. ముందుగా కొద్ది డోసులో పాము విషాన్ని ఒక గుర్రానికి ఇంజక్షన్ ద్వారా ఎక్కిస్తారు. ఈ విషానికి వ్యతిరేకంగా పోరాడే యాంటీబాడీలు గుర్రం శరీరంలో తయారవుతాయి. ఆ తర్వాత విషం డోసు పెంచి మళ్లీ గుర్రానికి ఇంజక్షన్ ద్వారా ఇక్కిస్తారు. ఈసారి గుర్రం శరీరంలో మరిన్ని ఎక్కువ యాంటీ బాడీస్ ఉత్పత్తి అయి విష ప్రభావాన్ని రద్దు చేస్తాయి.

ఇలా గుర్రానికి ఎక్కించే విషం డోసు క్రమక్రమంగా పెంచుతారు. గుర్రం శరీరంలో తగిన గాఢతలో యాంటీబాడీస్ ఉత్పత్తి అవుతాయి. పాము విషాన్ని ఈ యాంటీ బాడీస్ తట్టుకుని దాని ప్రభావం లేకుండా చేస్తాయి. ఇలా గుర్రానికి గరిష్ట డోసులో పాము విషాన్ని ఇచ్చిన తర్వాత దానిని తట్టుకోగల యాంటీబాడీస్ తయారయి ఉంటాయి కాబట్టి ఆ గుర్రం రక్తాన్ని సేకరిస్తారు.

రక్తంలోని ద్రవపదార్థాలయిన ప్లాస్మాను మిగిలిన ఘన పదార్థాల నుండి వేరుచేస్తారు. రక్తం గడ్డకట్టేందుకు సహకరించే ఫైబ్రిన్ వంటి పదార్థాలను కూడా ఈ ప్లాస్మా నుండి వేరుచేస్తారు. ఈ రకంగా శుభ్రపరచిన ప్లాస్మా అంటే బ్లడ్ సీరమ్‌లో కేవలం పాము విష ప్రభావాన్ని రద్దుపరచగల యాంటీ బాడీస్ మాత్రమే ఉంటాయి. దీనినే యాంటీ వెనమ్‌గా ఉపయోగిస్తారు. పాముకాటుకు గురైనవారికి ఈ యాంటీ వెనమ్‌ను ఇంజక్షన్ ద్వారా శరీరంలోకి పంపుతారు. అప్పుడది పాము విషాన్ని విరిచేస్తుంది.

పరిశోధనలు

పాము – ముంగిసలు భయంకరంగా పోట్లాడుకుంటాయి. పాము కాటుకు గురైన ముంగిస ఒకరకమైన ఆకు తింటుందని, అందుకే పాము విషం ముంగిస శరీరంలో పనిచెయ్యదని ఒక కథ ప్రచారంలో ఉంది. అందులో ఎంతమాత్రం నిజంలేదు.

పాముకాటును ఎదుర్కోగల శరీర నిర్మాణం ముంగిసకు వుంటుందంటున్నారు శాస్త్రవేత్తలు. పాము విషంలో 'ఆల్ఫాన్యూరోటాక్సిన్' అనే పదార్థం ఉంటుంది. ఇది కండరాల కణాల మీద ఉండే 'ఎసిటోల్కోలైన్ రిసెప్టార్ మాలిక్యూల్స్' ని అతుక్కుని పనిచేస్తుంది. ఈ రిసెప్టార్లు నరాల నుండి సూచనలు అందుకునే సహజస్వభావం కలిగి ఉంటాయి.

పాము విషంలోని 'ఆల్ఫాన్యూరోటాక్సిన్' నరాల నుండి రిసెప్టార్లకు సూచనలు అందకుండా నిలిపేస్తుంది. ఈ సూచనలు అందడం వల్లనే కండరాలు ఎప్పుడు సంకోచం చెందాలి, వ్యాకోచించాలి, విశ్రాంతి తీసుకోవాలి అనే విషయాలు నిర్ణయం అవుతాయి.

పాము విషం సూచనలు అందకుండా అడ్డుపడేసరికి కండరాలు, అవయవాలు స్థంభించి ఒక విధమైన పక్షవాతానికి గురవుతాయి. చివరకు ఇది మరణానికి దారి తీస్తుంది.

ముంగిస శరీరం

ముంగిస శరీరంలో రిసెప్టార్ మాలిక్యూల్స్ నిర్మాణం వింతగా ఉంటుంది. పాము విషంలోని 'ఆల్ఫా న్యూరో టాక్సిన్' ఈ రిసెప్టార్లకు అంటుకోదు. అందువల్ల ముంగిస శరీరంలోకి పాము విషం ప్రవేశించినా నరాల నుండి రిసెప్టార్లకు సూచనలు మామూలుగానే అందుతాయి. ఈ కారణంగానే పాము విషం ముంగిసకు ఏమాత్రం హాని చేయలేదు.

ముంగిస శరీరంలో ఎలాంటి రిసెప్టార్ మాలిక్యూల్స్ నిర్మాణం ఉందో సరిగ్గా అటువంటి నిర్మాణమే పాము శరీరంలో కూడా ఉంది. అందుకే తన విషానికి తానే మరణించకుండా ఉండేందుకు పాము శరీరంలో ఇటువంటి నిర్మాణం ప్రకృతి సమకూర్చింది.

ప్రయోగశాలలో ముంగిసల శరీరంలోని రిసెప్టార్ మాలిక్యూల్స్‌ను పలురకాల పరిణామాలకు గురిచేసి చివరకు అవికూడా పాము విషానికి ప్రభావితం అయ్యేటట్లు చేయగలిగారు.

ముంగిస క్షీరదాల కింద వస్తుంది. అయితే క్షీరదాలన్నీ పాము విషం నుండి తప్పించుకోలేవు. ఎలుకల్లాంటి క్షీరదాలు పాము విషం నుండి తప్పించుకోలేవు. పాము విషానికి గురయినప్పటికీ దాని ప్రభావం నుండి తప్పించుకోగల అరుదైన క్షీరదాల శరీర నిర్మాణంలోని కీలకాన్ని పరిశోధకులు గుర్తించగలిగారు.

రిసెప్టార్ల మీద రకరకాల ఒత్తిడులు కలిగించడం ద్వారా వాటి స్వభావాన్ని మార్చడం సాధ్యమయింది. ఈ ఫలితాలు ఆధారంగా కొత్త యాంటీ వీనమ్ మందును తయారు చేయడం అంత సులువుకాదు. అయితే చాలాకాలం రహస్యంగా మిగిలిపోయిన అంశాన్ని పరిశోధకులు పట్టుకోగలిగారు. ప్రయోగాల పరంపరలో ఈ దిశలో సరికొత్త యాంటీవెనమ్ తయారుకావచ్చు. సర్పకాటుకు గురైనవారిని మరణించకుండా కాపాడుకోవచ్చు. ★

కొత్త పుస్తకాలు

కరదీపిక

కమ్యూనిస్టుగా వ్యక్తిత్వాన్ని మలచుకోవడం రాజకీయ రంగంలోనూ ఆ విశిష్టతను నిలుపుకోవడం పుచ్చలపల్లి సుందరయ్య విలక్షణత. పరిచయం అక్కర్లేని ఆదర్శనేత. వ్యక్తిగతం, విప్లవపథం కలగలిపిన జీవితం ఆయనది. తన జీవితంలోని సంఘటనలను వాటి పర్యవసానాలను సూక్ష్మంగానైనా విశ్లేషణాత్మకంగా ఆత్మకథగా రాసిన కరదీపిక 'విప్లవ పథంలో నా పయనం'. బాల్యంతో ప్రారంభమై ప్రజా విముక్తి మార్గాన్వేషిగా జీవితంలో పెనవేసుకుపోయిన అనేక సంఘటనల సమాహారం ఈ పుస్తకం. పుచ్చలపల్లి వెంకటరామిరెడ్డి, శేషమ్మ దంపతులకు 1913, మే 1న సుందరయ్య జన్మించారు. ఆయన స్వగ్రామం నెల్లూరు జిల్లా అలగానిపాడు. సుందరయ్యది భూస్వామ్య కుటుంబం. నిశిత పరిశీలన సుందరయ్యకు బాల్యం నుండే ఉండేదనడానికి పుస్తకంలో ఆయన రాసిన పలు అంశాలు విదితం చేస్తాయి. తిరువళ్లూరులో బావగారింట ఉండి చదువుకునేటప్పటి సంగతినొకదాన్ని రాశారు. సుందరయ్యకు తమిళం రాదు. అప్పుడప్పుడు మార్కులు తక్కువగా వచ్చేవి. బావగారు కారణం అడిగేవారు. దానికి సుందరయ్య "నన్నేం చేయమంటారు. వాళ్ల అడిగారు. నేను రాశాను. కానీ మేం అడిగింది ఇది కాదు అని వాళ్లు తక్కువ మార్కులు వేశారు" అని చెప్పేవారట. ఎవరికైనా బాల్యం బాల్యమే కదా! మహిళల స్థితిగతులపై పరిశీలనకు దోహదం చేసిన అనేక అంశాలూ రాశారు. ఆయన మద్రాసు లయోలాలో ఇంటర్ చదువుతున్నప్పుడు హెచ్‌డి రాజా ద్వారా 'కమ్యూనిజం అంటే ఏమిటి?' అనే అంశంపై విని ఉత్తేజితులయ్యారు. కోర్సు మధ్యలోనే కాలేజీ విడిచిపెట్టి 1930లో కాంగ్రెస్ పార్టీ పిలుపుతో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. రెండేళ్ల జైలు శిక్షనూ అనుభవించారు. తంజావూరు బోర్‌స్టల్ స్కూలులో ఖైదీల పట్ల అధికారుల నిర్లక్ష్య, నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా రెండుసార్లు సత్యాగ్రహం చేశారు. విడుదల తర్వాత గ్రామంలో వ్యవసాయ కార్మికులను సంఘటిత పరిచారు. వేమన జయంతికి సహపంక్తి భోజనాలేర్పాటు చేశారు. దళితులకమ్మే సరుకుల ధరల్లోనూ వివక్షను గమనించి నెల్లూరు నుండి కావడిలో సరుకులు తెచ్చి కొన్నరేటుకు పేదలకే అమ్మేవారు. ఈ క్రమంలోనే మోపుకట్ట కూలి, పరిగె కూలి వగైరా సాంప్రదాయిక 'హక్కు'లను పరిశీలించి దోపిడీ రూపాలను అర్థం చేసుకున్నారు. ఈ అనుభవాలు 1928–30 మధ్యకాలంలో గ్రామంలో పనిచేసే రోజుల్లో వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్లను రూపొందించడానికి దోహదపడ్డాయని రాశారు. శాసనోల్లంఘనోద్యమాన్ని గాంధీజీ అర్థాంతరంగా నిలిపేసిన తర్వాత తనపై అమీర్‌హైదర్‌ఖాన్ ప్రభావం ఎక్కువగా ఉందని రాశారు. హైదర్‌ఖాన్ అరెస్టు తర్వాత సొంతూరులో పనిచేస్తూ తనను తాను కమ్యూనిస్టుగా మలచుకునేందుకు ఆలోచనను పటిష్ట పరుచుకున్నారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో పనిచేస్తూనే కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాన్ని కూడా చేపట్టారు. తదనంతరం అనేక పరిణామాలను, ఆ సందర్భంగా భారతదేశంలో పేరెన్నికగన్న ప్రముఖ నాయకుల వాదనా పటిమలను, వాటిలోని డొల్లతనాలనూ పుస్తకంలో సవివరంగా ప్రస్తావించారు. వీటిని చదవడం ద్వారా ప్రజాపక్షకుల, ప్రజావ్యతిరేకులను ఎలా గుర్తించవచ్చో, ఏ మాటల వెనుక ఎవరి ప్రయోజనాలుంటాయో తప్పక తెలుసుకోవచ్చు. ఒక రకంగా ఈ అధ్యాయాలలో లక్ష్యం ఎలా నిర్ణయించుకోవాలో, సాధన అంటే అది ఎలాంటి తపస్సో అర్థమౌతుంది. వాచాలత్వం, వాగాడంబరత్వం ఎందుకు పనికిరానివో పలు అంశాలలో నిర్దిష్టంగా వివరించారు. విషయాలను కార్యకర్తలకు వివరించేందుకు, వక్రమార్గమైతే దానిని ఖండించేందుకు వెనుకాడని తన శైలినీ ప్రస్తావించారు. విషయాలను ఏదో ముక్కునబెట్టుకుని ఉపన్యసించడానికి తాను వ్యతిరేకమని నిర్ద్వందంగా చెప్పారు. ఆయా ప్రాంతాల భౌగోళిక, ఇతర అంశాల సునిశిత అధ్యయనం సుందరయ్యకు మెండు. "గ్రామీణ పేదలు – భూపంపకం" పుస్తకంలో ఈ పరిశీలనే నేటికీ అధ్యయనాంశంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర నీటి పథకంలోని విషయాలు ఇంజనీర్లకు సైతం ఆశ్చర్యాన్ని, ఆమోదాన్ని కలిగించాయి. విశాలాంధ్రలో ప్రజారాజ్యమనే నినాదం, పుస్తకం ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు భూమికనేర్పరిచింది. ఈ అవగాహనే భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రాతిపదికైంది. దశాబ్దాలుగా అప్పుడప్పుడూ రగులుతున్న తెలంగాణ వేర్పాటు వాద ఉద్యమపూర్వ రంగాన్ని, ఆ సందర్భాలలో ఆయా పార్టీల వైఖరులపై వివరించారు. సైద్ధాంతికంగా సుందరయ్యది అవిశ్రాంత పోరాటమే. భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణా సాయుధ పోరాట సారథిగా, చట్టసభల్లో పేదల గొంతుకగా, స్వపక్షం, విపక్షం, అంతర్జాతీయం ఇలా ఎక్కడైనా నమ్మింది ఆచరించడమే ఆయన నైజం. ఇందుకు పుస్తకంలో దృష్టాంతాలు అనేకం. నిరాడంబరత ఆయన ఆస్తి. విప్లవ పథాన్వేషణ ఆయన శ్వాస. పుస్తకం ఆద్యంతమూ ఏదీ మినహాయించి చదవలేని జీవిత గమనమాయనది. అందుకే కాబోలు 'సుందరయ్యా.. నీలాంటి త్యాగజీవులెందరయ్యా' అన్నారు ఆరుద్ర. లక్ష్య నిర్దేశానికి, ఆచరణాత్మక వైఖరికి, ఉత్తేజం పొందాలనుకునేవారికి కరదీపిక ఈ పుస్తకం.

పుచ్చలపల్లి సుందరయ్య రచనల సంకలనం, వెల: 125/-, పేజీలు:360, ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. మరియు ప్రజాశక్తి అన్ని పుస్తక కేంద్రాలలో.

- ఉష



వేమన్న వేదం

ఆరుద్ర రచనలు

వెల : 60/-

పేజీలు :124

ప్రతులకు :

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

4-1-435, విజ్ఞాన భవన్,

అబిడ్స్, హైదరాబాద్.

మరియు

విశాలాంధ్ర అన్ని పుస్తక కేంద్రాలలో.

వ్యవసాయ రసాయనాలు

వెల : 60/-, పేజీలు :138

ప్రతులకు :

ప్రజాశక్తి బుక్ హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి,

హైదరాబాద్-20.

మరియు

ప్రజాశక్తి అన్ని పుస్తక కేంద్రాలలో.



చుక్కలు కలిపేద్దాం

ఫ్రెండ్స్! ఇక్కడ చుక్కల్లో ఏముందో చెప్పగలరా. ఏంటి తెలియడంలేదా? అయితే అదేంటో తెలియాలంటే 1 నుంచి 54 వరకు చుక్కలు కలిపేస్తే సరి!



త్రిభుజంతో 4 ఎలా?

హాలో పిల్లలూ... ఇక్కడ ఓ త్రిభుజం ఉంది. మీరేం చేస్తారంటే, అందులోంచి ఒక పుల్ల కదిలించి వేరే ఎక్కడైనా పెట్టి నాలుగు అంకెను చెయ్యాలి. ఏ పుల్ల తీసి ఎక్కడ పెడితే నాలుగు వస్తుందో చూసి పెట్టేయండి మరి.

సాక్సు బొమ్మ చేద్దామా...!

హాయ్ నేస్తాలూ... ఈ అమ్మాయి బొమ్మ బాగుంది కదూ! అయితే మీరు కూడా చేస్తారా? దీన్ని తయారు చేయడానికి పెద్దగా కష్టపడక్కర్లేదు. చాలా తేలిక. మరి చేద్దామా.

ఏమేం కావాలంటే...

పాత సాక్సు, దూది
ఒక రబ్బర్ బ్యాండ్, నలుపు, ఎరుపు రంగులు
కత్తెర, బ్రష్, పెన్సిల్

ఎలా చేయాలంటే...

సాక్సులో ముప్పావు వంతు వరకు దూదితో నింపేయండి. అంతవరకు ఒక రబ్బర్ బ్యాండ్‌తో గట్టిగా చుట్టేయండి. బొమ్మలో ఉన్నట్లు కొంచెం లావుగా రావాలన్న మాట. మొహం ఆకారం వచ్చింది కదా. ఇప్పుడు జుట్టును తయారు చేద్దాం. రబ్బర్ బ్యాండ్ కట్టిన పై భాగాన్ని కత్తెరతో నిలువుగా, సన్నగా (పొడవుగా) కత్తిరించండి. ఇవి వెంట్రుకలన్నమాట. మరి వెంట్రుకలు నల్లగా ఉండాలంటే నలుపురంగు వేయాలి కదా. అందుకే బ్రష్ తీసుకుని కత్తిరించుకున్న భాగానికి నలుపురంగు వేయండి. ఒక పోగుకు మరొకటి అంటుకోకుండా జాగ్రత్తగా వేయాలి. జుట్టు కూడా రెడీ అయిపోయింది. ఇక ముఖంలోని భాగాలను వేద్దాం. పెన్సిల్ తీసుకుని ముందుగా కళ్లు, నోరు, ముక్కు భాగాలను గుర్తు పెట్టుకోవాలి. ఇలా గుర్తుపెట్టుకున్న వాటిపై కళ్ల భాగంలో నలుపురంగు వేసుకోవాలి. ముక్కు, నోరు భాగాల్లో ఎరుపు రంగు వేయండి. ఆ రంగులు ఆరేవరకు పక్కన పెట్టండి. అంతే అమ్మాయి బొమ్మ రెడీ అయిపోయింది చూశారా! దీనికి పైభాగంలో ఓ దారాన్ని కట్టి దేనికైనా వేలాడదీసి చూడండి ఎంత బావుంటుందో! దీన్ని మీ స్నేహితులకి చూపించండి, భలే చేశావని ఎంత మెచ్చుకుంటారో! ఇలానే అబ్బాయి బొమ్మ కూడా చెయ్యొచ్చు. ప్రయత్నిస్తారా మరి.





రెట్టింపు అవుతుందా?



పక్క బొమ్మలో చతురస్రాకారంలో ఒక కొలను ఉంది. దానికి నాలుగు మూలల్లో నాలుగు చెట్లున్నాయి. ఆ చెట్లని కొట్టేయకుండా కొలను వైశాల్యాన్ని రెట్టింపు చెయ్యాలి. ఇక్కడ మరో విషయం ఏంటంటే కొలను వైశాల్యం పెరిగిన తర్వాత కూడా అది చతురస్రాకారంలోనే ఉండాలి. ఎలా?

ఎన్ని గ్లాసులకి సమానం



ఒక జగ్గు బరువు = ఒక గ్లాసు + ఒక సీసాకి సమానం. ఒక బాటిల్ బరువు = ఒక గ్లాసు + ఒక సాసర్ కి సమానం. రెండు జగ్గుల బరువు = మూడు సాసర్లు. అయితే ఒక సీసా బరువు ఎన్ని గ్లాసుల బరువుకి సమానం?



జవాబు: మూడవ తూకంలో జగ్గుని, ఒక గ్లాసు, ఒక సీసాతో మార్పిడి చేయాలి (తూకం మొదటి నుండి సమానంగా ఉండాలని మీకు తెలుసు). అంటే రెండు సీసాలు+ రెండు గ్లాసులు=మూడు సాసర్లకు సమానం. అలాగే నాలుగు గ్లాసులు+రెండు సాసర్లు=మూడు సాసర్లకు సమానం. ఒక్కో పళ్లెంలో నుండి రెండేసి సాసర్లు తీస్తే మనకు తెలిసిందేమిటంటే ఒక సాసరు నాలుగు గ్లాసులతో సమానం. కాబట్టి ఒక సీసా 5 గ్లాసులకు సమానం అవుతుంది.

d	o	d	o	u	b	l	o	o	n	s	z
x	b	d	p	w	t	l	j	e	p	t	q
x	c	l	k	l	e	d	a	r	a	p	f
z	d	l	o	g	m	c	w	i	e	e	w
a	y	l	k	c	i	e	u	s	l	k	y
q	y	r	a	s	a	g	f	t	p	a	d
e	q	a	u	v	n	s	p	a	r	c	m
n	j	m	d	i	i	c	o	h	u	g	a
e	i	o	c	s	h	n	s	f	p	n	s
r	s	n	g	j	e	s	r	z	j	i	k
z	a	m	l	c	n	u	c	a	h	k	s
d	g	r	e	e	n	c	t	a	c	i	x

carnival dancing doubloons gold

green hats king cake masks

music parade purple tuesday

పదాలు దాగున్నదెక్కడో...!

చిన్నారులూ.. ఇక్కడ బోలెడన్ని అక్షరాలున్నాయి చూశారుగా! వాటిలో కొన్ని పదాలు దాక్కున్నాయి. వాటన్నింటినీ మీరు వెతికి పట్టుకోవాలి. ఇవి అడ్డంగా, నిలువుగా, వంకరగా... ఎలాగైనా ఉండొచ్చు. అవి ఎక్కడున్నాయో వెతికి సున్నా చుట్టేయండి. ఎన్ని పదాలను పట్టుకుంటే అన్ని మార్కులు వచ్చినట్లు. మరి ఆలస్యం ఎందుకంట!?

గరిటె ముక్కు పక్షి

ఈ రోజు మనం చెప్పుకోబోయేది దేని గురించో తెలుసా? రాజహంస. ఇది లేత గులాబీ కలిసిన తెలుపు రంగులో ఉంటుంది. బాతుకంటే పెద్దది. కాళ్లు చాలా పొడవుగా, లేత ఎరుపు రంగులో ఉంటాయి. కాళ్లకు ఈకలుండవు. అంతేకాదు మెడ కూడా పొడుగ్గా, వంకర తిరిగి ఉంటుంది. దీని ఎత్తు ఎంతో తెలుసా? దగ్గర దగ్గర ఒకటిన్నర మీటర్లు. అంటే మనిషి ఎత్తు ఉంటుందన్నమాట. దీని ముక్కుకూడా ఎరుపు రంగులోనే ఉంటుంది. ముక్కు చివరి సగం వంపు తిరిగి గరిటె లాగా ఉంటుంది. ముక్కు ఇలా వుండడం వల్ల ఆహారాన్ని తేలికగా పట్టుకోడానికి వీలవుతుంది. ఇది ఎగురుతున్నప్పుడు దీని రెక్కలు ఎరుపు రంగులో ప్రకాశవంతంగా మెరుస్తుంటాయి. ఎగిరేటప్పుడు మెడ ముందుకి చాచి, కాళ్లు వెనక్కి పెడుతుంది. ఇది నీరుండే ప్రదేశంలోనే జీవిస్తుంది. నీరు ఎక్కడ ఉంటే అక్కడికి వలస వెళుంది. అంటే చెరువులు, ఉప్పునీటి మడుగుల లాంటివన్నమాట. గుంపులో ఒకటిగా జీవిస్తుంది. ఒక్కోసారి కొన్ని వేల రాజహంసలు కలిసి ఒక గుంపుగా వుంటాయి. ఎక్కువ లోతులేని నీటిలో ఆహారాన్ని పట్టుకుంటుంది. అంతేకాదు నీళ్లలో చాలా వేగంగా ఈదుతుంది. దీని గూటిని పలుచటి బురదతో మట్టిదిబ్బలో కడుతుంది. ఆ గూటిలో ఒకటి రెండు గుడ్లను మాత్రమే పెడుతుంది.



ఎన్నున్నాయో చెప్తారా...!

పిల్లలూ... కింది త్రిభుజంలో మరికొన్ని చిన్న త్రిభుజాలు ఉన్నాయి. ఇంతకీ అవి మొత్తం ఎన్నున్నాయో లెక్కపెట్టి చెప్పండి!



మాటల కోట - 53

రూపకల్పన : కర్లపాలెం

1	2	3	■	4	■	5	6	7
■	8		■		■	■	9	
10		■	■		■	■		■
	■	11	12	■	■	13		14
	■	15		■	■		■	
■	16		■	17	■	■	18	■
19		■	20		■	21		22
	■	23			24		■	
25		■		■		■	26	

అడ్డం :

1. అబ్బో... చాలా! (3)
5. వంటకం (3)
8. పాముల్లో ఒక రకం (2)
9. చేనులో భాగం (2)
10. పుట (2)
11. రామానాయుడు గారి లీడర్ మనుమడు (2)
13. జిడ్డు నూనె (3)
15. కాపాడు (2)
16. పొయ్యిలోంచి వచ్చేది (2)
19. మొదటి (2)
20. ఆడది అబల కాదు స.... (2)
21. తగ్గుదల (3)
23. సుందరయ్యగారి ఇంటిపేరు (5)
25. చాటుగా మాటు వేయడం (2)
26. అరుపు (2)

నిలువు :

1. సుభాష్ చంద్రబోస్ బిరుదు (3)
3. ఇది మోగినట్లు కనకంబు మోగునా (2)
4. పాత తరం సినీతార. 'పుత్తడి' బొమ్మే అనుకోండి (3)
6. పద్మం (4)
7. బంధం (2)
10. శుభకార్యాల సందర్భంగా ఇరుగు పొరుగు ఆడవాళ్లను పిల్చుకుని చేసేది (3)
11. రాక్షసి (3)
12. నీటిలో పెరిగే అతి సూక్ష్మమైన తీగ (2)
13. గోవు (2)
14. తుండమునేక .... (2)
16. మనసు (2)
17. తిరగబడిన మహిళ (3)
18. అందమైనది: అన్నంలో దీనితో పాటు రెండు చుక్కల నెయ్యి వేస్తే చిన్నారులు ఇష్టంగా తినేస్తారు (2)
19. వసంతం (3)
20. ఒక ఆకు కూర (3)
21. అమ్మ (2)
22. మింగడం (3)
24. తెలుగు కాటన్ (2)

మాటలకోట - 52 జవాబు

1 ప	రు	2 వ	ము	■	3 గ	4 ర	ళ	ము
■	■	డి	■	5 పం	■	శ్మి	■	■
6 చా	7 సో	■	8 నిం	డు	గ	■	9 సా	10 న
11 మ	లి	12 నం	■	గ	■	13 ఆ	ద	రం
■	■	14 ద	డి	■	15 గి	రో	■	■
16 ఆ	17 ది	నం	■	18 కు	■	19 గ్యం	20 రా	21 వై
22 రు	క్కు	■	23 జా	ద్య	ము	■	24 గి	రి
■	■	25 మా	■	ము	■	26 పీ	■	■
27 గు	ర	28 జా	ల	■	28 కే	త	న	ము



అమ్మ మాట

అనగనగా ఓ అడవి. అందులో ఓ పులి. దానికి రెండు పిల్లలు పుట్టాయి. అవి వాళ్లమ్మ దగ్గర పాలు తాగడం తగ్గించాయి. తల్లి తెచ్చిన మాంసం చీల్చుకుని తినడం నేర్చుకున్నాయి. కాళ్లలో శక్తివచ్చిన తర్వాత తల్లివెంట వేటకు వెళ్లడం, తల్లి చంపిన జంతువుల్ని తినడం మొదలుపెట్టాయి. వాటికి ఇక సొంతగా ఆహారం తెచ్చుకోవడం నేర్పాలనుకుంది తల్లి. ఓ రోజు వాటిని పిల్చి హితబోధ చేసింది.

"మొదటిది, మనకంటే బలవంతుడితో ఎప్పుడూ విరోధం పెట్టుకోకండి. రెండవది, ఆపదలో చిక్కుకునే పరిస్థితి ఉంటే అటువంటి ఆహారాన్ని వదిలేయడం మంచిది. మరోచోట వెతుక్కోవచ్చు. మూడవది, శత్రువులు చిన్న జంతువులైనా, సమూహంగా ఉంటే చాలా ప్రమాదం. వాటినుండి తొలగిపోవాలే గానీ, తగాదా పడడం మంచిది కాదు. ఈ మూడు సూత్రాలు పాటిస్తే, సాధ్యమైనంత సురక్షితంగా ఈ అడవిలో బతుకుతారు" అని సూచనలు చేసింది తల్లిపులి.

తల్లి చెప్పిన మాటలు చిన్నపులి శ్రద్ధగా పాటించేది. కానీ పెద్దది లెక్కచేసేది కాదు. 'నన్ను చూస్తేనే జంతువులు పారిపోతున్నాయి. నాకు చాలా బలముంది. కనుక నేను దేన్నీ లక్ష్యపెట్టనవసరం లేదు" అనేది. మూర్ఖంగా రేసు కుక్కల మధ్యకు వెళ్లి మాంసాన్ని సైతం లాక్కొచ్చేది.

ఒకసారి చిన్నపులి, పెద్దపులి కలిసి వేటకు వెళ్తున్నాయి. వాటికి ఓ చెట్టుకింద ఊబిలో చిక్కుకున్న అడవిమేక కనిపించింది. అది బయటకు రావడానికి శతవిధాలా ప్రయత్నిస్తోంది. మేకను చూసిన పులులు రెండూ గబాల్న చెట్టుకిందకి పరుగెత్తాయి. వాటిని చూసిన మేక ప్రాణభయంతో బిగ్గరగా కేకలు పెట్టింది.

ఊబిని చూసిన చిన్న పులి "అన్నయ్యా! ఇందులో ఏ జంతువు పడ్డా పైకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మనం మరోచోట మాంసం వెతుకుదాం పద" అంది.

"నా బలాన్ని తక్కువ అంచనా వేస్తున్నావు తమ్ముడూ. మేకకు తక్కువ బలం ఉంటుంది. అందుకే అది బయటకు రాలేకపోతోంది. కానీ నా బలం నీకు తెలుసు కదా. ఉన్న చోటినుండే ఇరవై అడుగుల దూరం దూకగల్ను. చక్కటి మేకను వదులుకోమంటావా?" అంది.

"తప్పదన్నయ్యా. ఆపదలో చిక్కుకునే ఆహారం ఆశించకూడదని అమ్మ చెప్పలేదూ. ఒకసారి అమ్మ చెప్పిన మాటలు జ్ఞాపకం తెచ్చుకో" అంది చిన్నపులి.

"అమ్మదంతా చాదస్తం. నేను హైనాల మధ్యనున్న దున్నపిల్లనే లాక్కొచ్చాను. నావెంట పడ్డ హైనాలను దెబ్బకోదాన్ని చంపేశా. నా శక్తి మీద నాకు అపారమైన నమ్మకముంది. మేకను చంపి, ఒడ్డుకు ఈడ్చుకొస్తా. ఇద్దరం కలిసి తిందాం ఉండు" అంది.

చిన్నపులి ఎంతగానో చెప్పిచూసింది. కానీ పెద్దపులి వినలేదు. లంఘించి అమాంతం మేకమీదికి దూకింది. మేక బుడుంగుమని ఊబిలో మునిగిపోయింది. పులికూడా ఊబిలో గొంతుదాకా దిగబడిపోయింది. తన బలమంతా ఉపయోగించి వెలుపలకు రావాలని ప్రయత్నించింది. కానీ కదిలేకొద్దీ లోపలకు కూరుకుపోతోంది.

"తమ్ముడూ! చాలా బలముందన్న మూర్ఖత్వంతో దూకాను. కానీ ఇలాంటి చోట బలం ఎందుకూ పనికిరాదని తెలిసిపోయింది. ఎలాగైనా నన్ను కాపాడు. లేకుంటే మేకలాగే మునిగి చచ్చిపోతాను" అంది కన్నీళ్లు పెట్టుకుంటూ.

"అమ్మ చెప్పిన మాట జవదాటొద్దంటే విన్నావా? సరే ఎటూ కదలకు. అలాగే ఉండు" అని చెప్పి గబగబా వెళ్లి మర్రి ఊడల్ని తెంపుకుని వచ్చింది. వాటిని ఒడుపుగా పెద్దపులి ముందు పడేట్లు వేసింది. "నోటితో గట్టిగా పట్టుకో" అంది. అది ఊడల్ని నోటితో పట్టుకున్న తర్వాత మెల్లగా చిన్నపులి ఒడ్డుకు లాగింది. ఒడ్డున పడ్డ పెద్దపులి "పెద్దల మాట వినకుంటే ఇలాంటి ప్రమాదాలే వస్తాయి" అని బుద్ధిగా తమ్ముని వెంట వెళ్లింది.

- పుప్పాల కృష్ణమూర్తి



ఏం పిల్లడో...!

'వావ్! పిల్లలంటే ఇలా వుండాలి బొద్దుగా...ముద్దుగా' అనుకుంటున్నారా! అయితే ఒకే ఒక్క నిముషం ఆగండి. ఎందుకంటే ఆ చిన్నారి వివరాలు చెప్పాక కూడా మీకు అలా అనిపించకపోవచ్చు.

ఈ చైనా చిన్నారి పేరు లూ జిహావో. వయసు నాలుగేళ్లు. ఈ పసి ప్రాయానికే ప్రపంచ రికార్డు సృష్టించేశాడు. అదేంటంటే...ఈ పిడుగే ప్రపంచంలోకెల్లా బరువైన పిల్లవాడు. ఇంతకీ వాడి బరువెంత? అంటారా! ఆ ...ఎంతా! 62 కేజీలే. పొడవు మాత్రం 110 సెంమీ. ఏంటి ఈ మూడు విషయాలకే అలా అయిపోయారు. పాపం లూ మామూలుగానే పుట్టాడు. అప్పుడు వాడి బరువు 2.6 కేజీలు. అయితే మూడు నెలలకే బాగా బరువు పెరిగాడు. ఇక అప్పటినుంచి బరువు పెరుగుతూనే వున్నాడు. దాంతో వాడి తల్లిదండ్రులకు కంగారు మొదలైంది. వారు ఎక్కిదిగని ఆసుపత్రి గుమ్మం లేదంటే నమ్మండి. స్థానిక వైద్యులకు పిల్లవాడి సమస్య ఏంటో అర్థంకాలా. ఒకరు మాత్రం పిల్లవాడి తలలో ట్యూమర్ వుందన్నారు. ఇద్దరు లేదన్నారు. మామూలుగా తన వయసు పిల్లలకంటే 5 రెట్లు బరువెక్కువ వున్నాడు లూ. ఫుడ్డు మాత్రం ఫుల్లుగా లాగించేస్తాడు. కాకపోతే వ్యాయామం చెయ్యడమన్నా, వ్యాహ్యాళికి వెళ్లడమన్నా మనోడికి అస్సలు ఇష్టముండదు. కొద్దిగా బద్ధకం ఎక్కువ. రోజూ తల్లి మోటారుసైకిల్ మీద స్కూలుకెళతాడు.

ఇన్ని వివరాలు విన్నాక ఏమనిపిస్తోంది మీకు? 'ఏం పిల్లడో ఏంటో?!' అనా.